
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 30 జనవరి 2024 | 5





మీరే మా దైవం : ఎన్టీఆర్ విగ్రహానికి నమస్కరిస్తున్న చంద్రబాబు నాయుడు



మనదే విజయం : టీడీపీ జెండాతో మహిళ



ఇది నా టీమ్ : వేదికపై చంద్రబాబుతో గోరంట్ల, యనమల, చినరాజప్ప, రామకృష్ణారెడ్డి, ఆదిరెడ్డి అప్పారావు, మద్దిపాటి వెంకటరాజు, కందులదుర్గేష్, జోన్-2 కోఆర్డినేటర్ మందలపు రవి, ప్రత్తిపాటి, బాపిరాజు, ఆర్ఎస్, యర్రా, హరీష్‌మాధుర్, బండారు తదితరులు

మీకు నేనున్నా : రాజమహేంద్రవరంలో జరిగిన రా కదలిరా సభలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు



జన గోదారి

తెలుగుదేశం పిలిచిందని.. కదిలొచ్చిన జనం

- జనచంద్రమైన రాజమహేంద్రి
- వేలాది వాహనాల క్యూ
- లక్షలాదిగా జన ప్రవాహం
- దారులుగా మారిన చేల గట్లు
- కిక్కిరిసిపోయిన కాతేరు
- గామన్ బ్రిడ్జి మీదుగా ట్రాఫిక్
- టీడీపీ, జనసేన జెండాల హోరు
- అధిక సంఖ్యలో మహిళల హాజరు

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/అర్బన్/రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం/కొవ్వూరు/తాళ్ళపూడి, జనవరి 29 : గోదావరితీరం.. జనగోదారిగా మారిపోయింది.. రాజమహేంద్రవరం నగరం జనంతో పోటెత్తింది. దారులన్నీ జనదారులుగా మారిపోయాయి. వాహనాలు కిలోమీటర్ల లెక్కన బారు లు తీరాయి. ఎటుచూసినా, ఎక్కడ చూసిన జనమే. చేల గట్లు రహదారులయ్యాయి. రా కదలిరా సభా ప్రాంగణం అంతా జై టీడీపీ, జై జనసేన నినాదాలతో హోరెత్తింది. చంద్రబాబు 'రా.. కదలిరా' సభ జన 'చంద్ర'మైంది. మహిళాలోకం వెల్లువలా తరలివచ్చింది. వయసు పైబడిన పెద్దలు సైతం ఉత్సాహంగా కదలి వచ్చారు. రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో సోమవారం ఉదయం 10 గంటలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు "తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా" సభ నిర్వహించారు. సభ జరిగే ప్రదేశం చంద్రబాబు రాకకు రెండు గంటల ముందే జనంతో కిటకిటలాడింది. చంద్రబాబు సభను విశాలమైన మైదానంలో ఏర్పాటు చేసినా జన ప్రభంజనంతో నిండిపోయింది. సభా ప్రాంగణం కాతేరు ప్రధాన రహదారి పక్కనే ఉన్నా ఎటు చూసినా జనంతో నిండిపోవడంతో పొలం గట్లతో సహా అందుబాటులో ఉన్న అన్ని దారుల్లోనూ పసుపు దండు, జనసైనికులే కనిపించారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలే కాకుండా, మిగిలిన జిల్లాల నుంచి కార్లు, బైక్‌లు, బస్సులు, ఆటోలు చివరకు సైకిళ్లపై కూడా టీడీపీ, జనసేన కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. ప్రతి నియోజకవర్గం నుంచి 30 వేల మంది వస్తారని అంచనా వేయగా దాని తగినట్లుగానే తరలివచ్చారు. టీడీపీ, జనసేన జెండాలతో సభా ప్రాంగణం కళకళలాడింది.. జై చంద్రబాబు, జై పవన్‌కల్యాణ్, జై తెలుగుదేశం, జై జనసేన అంటూ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. ఉదయం 10:30 గంటలకు సభ ప్రారంభం అయ్యే సమయానికి ఇటు కొవ్వూరు, కొంతమూరు, నాలుగోబ్రిడ్జి రోడ్డు, కాతేరు, సీతానగరం రోడ్డు, వాహనాలతోను, కార్యకర్తల ప్రదర్శనలతోను కిక్కిరిసింది.భారీ స్థాయి ఊరేగింపులు జరిగాయి.. రూరల్ మండలం ధవళేశ్వరం నుంచి, కడియం, రాజానగరం, సీతానగరం, రాజమహేంద్రవరం అర్బన్, కోరుకొండ మండలాలతో పాటు అటు కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం, తాళ్లపూడి తదితర మండలాల నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు నాయకులు భారీ ప్రదర్శనలు నిర్వహిస్తూ కాతేరు చేరుకున్నారు. దీంతో ఆయా రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. సభ ముగిసిన తరువాత సుమారు గంట పాటు రహదారులన్నీ జనంతో నిండిపోయాయి. అటుపై మధ్యాహ్నం 2-30 , 3 గంటల మధ్య సాధారణ స్థితికి వచ్చింది. స్థానిక లూథర్‌గిరి కాంపౌండ్ నుంచి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెకటరీ ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ప్రసంగాన్ని జనం తదేకంగా విన్నారు. ప్రధానంగా మహిళలు చంద్రబాబును చూడడానికి ఉత్సాహం చూపించారు. నాయకులు ఊహించినదానికంటే జనం భారీగా తరలిరావడంతో కొన్ని చోట్ల ఫెక్సీలను సైతం పక్కకు పెట్టాల్సి వచ్చింది. ఎండ కాస్త ఎక్కువగా ఉన్నా లెక్కచేయకుండా చంద్రబాబు స్పీచ్ వినడానికి ఆసక్తి చూపించారు. చంద్రబాబు సైతం జనాలను ఉత్సాహపరుస్తూ అధికార పార్టీని కడిగిపాడేశారు. మధ్యమధ్యలో జగన్‌పై ఆయన పేల్చిన హాస్యపు తూటాలకు జనం కేరింతలు కొట్టారు. పెద్ద సంఖ్యలో రెపరెపలాడిన టీడీపీ, జనసేన పార్టీల జెండాలు గెలుపు మనదే అన్నట్లుగా ఉండడంతో తెలుగు తమ్ముళ్లు, జనసైనికుల్లో గోదారిలా ఉత్సాహం ఉప్పొంగింది. భారీగా తరలివచ్చిన జనం ఇబ్బందిపడకుండా వందలాది ప్యాకెట్ల మజ్జిగ, మంచినీళ్ల బాటిళ్లు, బస్తాలకొద్దీ వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలోనూ వివిధ ప్రాంతాల నుంచి జనం సభకు వస్తూనే ఉండడం గమనార్హం. ప్రవేశ ద్వారాలు ఎక్కువగా ఏర్పాటు చేయడం, ప్రాంగణం విశాలంగా ఉండడం, పార్కింగ్ ప్రణాళికాబద్ధంగా ఉండడంతో ఎవరికీ ఇబ్బంది కలగలేదు. చంద్రబాబు వెళ్లిన తర్వాత ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పోలీసులు ట్రాఫిక్‌ని నాలుగో వంతెన మీదుగా మళ్లించడంతో పెద్దగా సమస్య రాలేదు. మొత్తం మీద రాకదలిరా సభ విజయవంతమైంది.

వైసీపీ నాయకులే కౌరవులు..



జగన్ సభలో కౌరవులు, పాండవులుగా మాట్లాడారు. వాస్తవానికి జగన్ గ్రహించాల్సి ఒకటుంది. పాండవులనే వారు టీడీపీ జనసేన కూటమే.కౌరవులు వైసీపీ నాయకులు. జగన్‌కి రామ్‌గోపాల్ వర్మ నిర్మించిన వ్యూహం సినిమా గురించి తెలుసు.. కానీ పద్మవ్యూహం గురించి తెలుసుకోవాలి.మడుగులో దాగున్న దుర్యోధనుడు జగన్.వైసీపీ అనేది ఇంపోర్ట్ ఎక్స్‌పోర్టు కంపెనీగా తయారైంది. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులను దోచేశారు.అన్ని వ్యవస్థలను సర్వనాశం చేశారు. ఇసుకమాఫియా,మట్టి మాఫియా ఇలా అన్ని వ్యవస్థల్లోను డబ్బులు నొల్లుకున్నారు.ఈ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు దాపురించాయి. టీడీపీ జనసేన కూటమి విజయబావుటా ఎగుర వేయడం ఖాయం.

- కందుల దుర్గేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు

దళిత ద్రోహి జగన్...



నాలుగేళ్ల తొమ్మిది నెలల జగన్ పాలనలో ఈ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలను అణచి వేసి జగన్ దళితద్రోహిగా మారాడు. ఇటీవల భీమిలిలో జరిగిన సభలో క్రాస్‌ముద్రణపోలిన ర్యాంపు వేసి బూట్లు, చెప్పులు ధరించిన కాళ్ళతో ఆ క్రాస్‌పై నడుస్తూ క్రైస్తవ్యాన్ని అపహాస్యం చేశాడు. భారత రాజ్యాంగానికి ఈ రాష్ట్రంలో తూట్లు పొడిచాడు. ఎస్సీ ఎస్టీ మైనారిటీలను దగా చేశాడు. మాస్క్ అడిగిన డా. సుధాకర్ మొదలు డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు మారణకాండను సృష్టించాడు.దళితజాతి ఆత్మగౌరవం నిలబడాలంటే టీడీపీ జనసేన అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి.

- కేఎస్ జవహర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

జగన్‌ను ఇంటికి సాగనంపాలి



టీడీపీ హయాంలో 6,200 ఇళ్ళు కడితే వాటికి రంగులు మార్చాడే తప్ప వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా తూట్లు పొడిచాడు. జల జీవన్ మిషన్ రద్దు చేశాడు.రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేశాడు. బలహీన వర్గాలకు దగా చేశాడు.అవినీతి అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉన్న జగన్‌ను ఇంటికి సాగనంపాలి.

- గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్యే



జై బాబు : టీడీపీ జెండాతో మహిళ నినాదం

కిక్కిరిసిన కాతేరు రోడ్డు





వెల్‌కమ్ సార్ : వేదికపై చంద్రబాబుకు నమస్కరిస్తున్న నాయకులు



వచ్చేశాం : సభకు తరలివచ్చిన కొవ్వూరు టీడీపీ, జనసేన నాయకులు



మేం సైతం : నిడదవోలు నుంచి వెళుతున్న నాయకులు



బాబును కలుద్దామని : సభ వద్ద ముప్పాళ్ల ఇతర న్యాయవాదులు



చేల గట్లే దారులయ్యాయి : చేల గట్లపై వస్తున్న టీడీపీ అభిమానులు





బాబుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి, దుర్గేష్



నీవే మా రాజు : బాబుకు కిరీటం



మొక్కను ఇస్తున్న హరీష్, ఆదిరెడ్డి వాసు



బాబుతో జ్యోతుల నెహ్రూ



బాబుకు వరి కంకులు, నాగలి ఇస్తున్న చంటి



పుష్పగుచ్ఛమిస్తున్న బత్తుల



నులి పురుగుల నివారణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

కుష్టువ్యాధిగ్రస్తులపై వివక్ష వద్దు : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 29 : కుష్టువ్యాధి బాధితుల విషయంలో వివక్ష వద్దు అని, క్షయరహిత జిల్లాగా తూర్పుగోదావరిని తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. కలెక్టరేట్‌లో స్పర్శ అవగాహన పక్షోత్సవాల వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు.గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నుంచి ఫిబ్రవరి 13 వరకూ క్షయ వ్యాధి నిర్మూలన స్పర్శ అవగాహన పక్షోత్సవాలపై ప్రచారం నిర్వహించాలన్నారు. జేసీ తేజ్‌భరత్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎస్.వసుంధర,అధికారులు పాల్గొన్నారు.

9న నులిపురుగుల నివారణ కార్యక్రమం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 29 : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగుల నివారణ ఎంతో అవసరం అని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఫిబ్రవరి 9, 16 తేదీల్లో నిర్వహించే నులి పురుగుల నివారణ (డీ వార్మింగ్ డే)కార్యక్రమంపై వైద్యాధికారులు, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. నులిపురుగుల నివారణకు ప్రజలు, పాఠశాల విద్యార్థులు సహకరించాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు అవగాహన కల్పించాలన్నారు. వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పులి భయం..భయం
ఇంకనూ అంతుచిక్కని జాడ 7

రేపు నన్నయ స్నాతకోత్సవం
గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక 7



స్పందన దరఖాస్తులు పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

ఎస్పీ స్పందనకు 20 అర్జీలు

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సమస్యలు సత్వరం పరిష్కరిస్తామని అడిషనల్ ఎస్పీలు రాజశేఖర్‌రాజు, వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా పోలీసుల కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పోలీసులు, ఇతరులు తరలివచ్చారు.ప్రజల నుంచి 20 అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి చట్ట ప్రకారం త్వరితగతిన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

వచ్చే నెల 4 వరకూ కులగణన : జేసీ

రాజమహేంద్రవరం, జనవరి29(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని కులగణన నూరుశాతం నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జేసీ తేజ్ భరత్ ఆదేశించారు. ఈ నెల 19వ తేదీ నుంచి కులగణన ప్రారంభించారు. 28వ తేదీలోగా పూర్తి చేయా లని ఆదేశించారు.కులగణన బాధ్యతను సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అంద జేశారు. అయితే అనుకున్న లక్ష్యం పూర్తికాలేదు. ఈ మేరకు కులగణన సర్వే వచ్చేనెల 4వ తేదీ వరకూ పొడిగించినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలి పారు. ఇప్పటి వరకూ జిల్లాలో 88.17శాతం పూర్తి చేశామ న్నారు. కులగణన పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. ఎక్కడైనా తేడాలుంటే చర్యలు తప్పవని అన్నారు. కులగణనకు ప్రజలు సహకరించాలన్నారు.

స్పందన సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా స్థాయి స్పందనకు 186 అర్జీలు వచ్చాయని, వాటి పరిష్కారానికి నిర్దేశిత కాలంలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత తెలిపారు. అర్జీలు ఆన్‌లైన్‌లో 164, ఆఫ్‌లైన్‌లో 22 వచ్చాయన్నారు.వాటిలో రెవిన్యూకు 71, పంచాయతీరాజ్ 33, పోలీస్ 15, విద్యుత్ 12 ఉన్నట్లు తెలిపారు. కోలమూరు గ్రామానికి చెందిన 9 స్వయం సహాయక సంఘ సభ్యులకు అర్హత ఉన్నా కాతేరు బ్యాంక్ ఆఫ్ బరోడా రుణాలు ఇవ్వడంలేదని ఫిర్యాదు చేశారు. నిడదవోలు మండలంలోని కలవచర్లకు చెందిన ఎలక నిర్మల ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేశారు. గోపాలపురం మండలం బుచ్చయ్యపాలెం గ్రామస్థులు డ్రైనేజీ సమస్యపై ఫిర్యాదు చేశారు.వీటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కొవ్వూరు మండలం ఆరికరేవులకు చెందిన కెఎస్ఎస్‌వీవీ సత్యనారాయణ తనకు 64శాతం వైకల్యం ఉందని, దివ్యాంగుల పెన్షన్ వర్తింప చేయాలని వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి సత్వర పరిష్కారంచూపాలని అధికారులకు సూచించారు.

విజిలెన్స్ ఎస్పీగా సుబ్బారెడ్డి

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా(విజిలెన్స్ ఎస్పీ) 2015 బ్యాచ్ ఐపీఎస్ అధికారి కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా మంగళగిరిలోని ఆరో బెటాలియన్ ఏపీఎస్పీ కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుబ్బారెడ్డిని రాజమహేంద్రవరం విజిలెన్స్ ఎస్పీగా బదిలీ చేసింది. సుమారు మూడేళ్లగా ఈ పోస్టు ఇన్‌చార్జిలతో నడుస్తోంది. ఏలూరు ఎస్పీ కరణం కుమార్.. తర్వాత విశాఖ ఎస్పీ సురేశ్‌బాబు ఇప్పటి వరకూ ఇన్‌చార్జిగా ఉన్నారు. హోంమంత్రి సొంత జిల్లాలో విజిలెన్స్‌కి ఐపీఎస్ అధికారి పూర్తి స్థాయి విధుల్లో ఎన్నికలు సమీపి స్తుండగా నియమితులు కావడం గమనార్హం.

కత్తితో పొడిచిన భార్య.. భర్త మృతి

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గొడవలు భర్త మృతికి దారితీశాయి. రాజమహేంద్రవరం రామదాసుపేటలో నివాసం ఉంటున్న జి.సత్తిబాబు, జ్యోతికి ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి పిల్లలు లేరు.ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి సత్తిబాబు తాగొచ్చి భార్యతో గొడవపడ్డాడు.ఈ క్రమంలో సత్తిబాబును జ్యోతి కూరగాయలు కోసుకొనే కత్తితో పొడిచింది. తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే అతడిని ఆమె, స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు.

టీడీపీ, జనసేనదే విజయం

● రా కదలిరా సభలో నేతలు ● ప్రభుత్వ విధానాలపై ధ్వజం



మాట్లాడుతున్న చంద్రబాబు..సభకు హాజరైన ఉమ్మడి జిల్లా నేతలు

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం: జనవరి 29 : కాతేరులో జరిగిన రా.. కదలిరా.. బహిరంగ సభలో టీడీపీ, జనసేన ముఖ్య నేతలు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిల అధ్యక్షతన సభ ప్రారంభమైంది. చంద్రబాబునాయుడు రాకకు ముందే ముఖ్య నాయకులు కొందరు సభలో మాట్లాడారు.

ఏ వర్గం సంతోషంగా లేదు

అనపర్తి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదన్నారు. గోదావరి చెంతనే ఉన్నా జిల్లా రైతాంగం పడుతున్న కష్టాలు వర్ణనాతీతమన్నారు. మొదటి పంటకు నీరివ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని, ఇక రెండో పంట పరిస్థితి దారుణం అన్నారు. ధాన్యం కొనుగోలు మోసపూరితం అని, రైతుల సొమ్ములను వైసీపీ ప్రజాప్రతినిధులు కాజేశారని ఆరోపించారు. వైసీపీ అంటే రెడ్ల పార్టీ అని నమ్మించి మోసం చేశారని, ఈవేళ రెడ్లే జగన్ పేరు చెప్పుకోడానికి సిగ్గుపడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి 165 స్థానాల్లో విజయం సాధించడం ఖాయం అన్నారు.

ఏపీలో రాజకీయ సంక్షోభం

అనపర్తి జనసేన ఇన్‌చార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీ రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, రాక్షస పాలన సాగుతోందని, దీన్ని అంతమొందించేందుకు టీడీపీ, జనసేనలు కలిసి క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయాలన్నారు. 151 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తంచేస్తున్న జగన్ ఇటు 1 కానీ, అటు 1 కానీ పోయి 15, లేదా 51 సీట్లకు పరిమితమవుతాయన్నారు.

ప్రజల తిరుగుబాటుతో జగన్‌కు వణుకు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఎప్పుడు దిగిపోతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ప్రజల తిరుగుబాటుకు జగన్ భయపడుతున్నారన్నారు. టీడీపీ, జనసేన ఈ రాక్షస ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధిస్తోందన్నారు.

దుష్టపాలనను అంతమొందించాలి

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు మాట్లాడుతూ దుష్టపాలనను అంతమొందించి రాష్ట్రాన్ని రక్షించేందుకు టీడీపీ, జనసేనలు ఏకమయ్యాయని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు చరిత్ర సృష్టించబోతున్నారని, విజయం తథ్యమని అన్నారు.

వైసీపీకి డిపాజిట్లు రావు

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా రావన్నారు. సహజ వనరులను, సంపదను వైసీపీ ప్రజాప్రతినిధులు భక్షించారన్నారు. ఇసుక, మట్టి పేరిట దోపిడీలు చేశారని.. ఆవ భూముల పేరుతో దోచేశారని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి రాగానే వాటన్నింటినీ కక్కిస్తామన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో టీడీపీ యువత ఆవేశం కట్టలు తెంచుకుంటే అదుపు తప్పకుండా తమ నాయకుడు లోకేశ్ చాలా సమయస్ఫూర్తితో లీడ్ చేసి దిశానిర్దేశం చేశారని గుర్తుచేశారు. టీడీపీ జనసేనలు అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం జరుగుతుందని, బీసీ రక్షణ చట్టం వస్తుందని స్పష్టంచేశారు.

యువతకు ఉద్యోగాలు ఏవీ?

రాజమహేంద్రవరం జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ యువతకు జగన్ ఉద్యోగాలు ఇవ్వలేదుగానీ, మత్తును మాత్రం పెంచాడన్నారు. డ్రైవరు సుబ్రహ్మణ్యంను హత్యచేసిన ఎమ్మెల్సీని పక్కన కూర్చోబెట్టుకున్నారని, కోడికత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా చేశారని, బాబాయి హత్య కేసును విచారణ జరగకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు.

బీసీలకు గుర్తింపునిచ్చే పార్టీ టీడీపీ

టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సమితి కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ బీసీలకు గుర్తింపు ఇచ్చిందే అన్న ఎన్టీఆర్ అని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎదగడానికి దోహదపడ్డారన్నారు. ఆ రిజర్వేషన్లను చంద్రబాబు పెంచి అమలు చేశారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు అన్యాయం చేశారన్నారు. బీసీలకు విదేశీ విద్యనందించి ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేసుకునే అవకాశం ఇస్తే, అదే బీసీ వర్గాలకు జగన్ మద్యం షాపుల్లో గుమస్తాలుగా, గ్రామాల్లో వలంటీర్లుగాను చేశాడన్నారు. టీడీపీ, జనసేన కూటమికి 170 సీట్లు రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

జగన్‌ది రాక్షస పాలన

గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం ముందు-తరువాత ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారిందని, అభివృద్ధి పథంలో ఉన్న ఆంధ్రరాష్ట్రంలో 42 ఏళ్ల తరువాత రాక్షస పాలన జగన్ రూపంలో వచ్చిందన్నారు. దీన్ని అంతమొందించేందుకు రా.. కదలిరాకు చంద్రబాబు పిలుపునిచ్చారని తెలిపారు. మోసపూరిత హామీలతో జగన్ మహిళల నెత్తిన చెయ్యి పెట్టారని, మద్యపాన నిషేధం అంటూ మహిళల తాళిబొట్లు తెంపేశాడన్నారు. ఇటువంటి తరుణంలో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టీడీపీ, జనసేనలు కలిశాయని స్పష్టంచేశారు.

అన్యాయంగా చంద్రబాబును అరెస్టు చేశారు

గోపాలపురం జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడుతూ అన్యాయంగా చంద్రబాబును 52 రోజులు జైలులో పెట్టి ఆధారాలు లేని కేసులో కక్షసాధింపులకు పాల్పడిన జగన్ ఆనాడే తన రాజకీయ పతనానికి నాంది పలికాడన్నారు. చంద్రబాబును పరామర్శించిన పవన్‌కల్యాణ్ ఆరోజు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఇరుపార్టీలు జగన్ పాలనపై పోరాడుతున్నాయన్నారు. నాలుగేళ్ల తొమ్మిది నెలల కాలంలో జగన్ రూ.9 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజల నెత్తిన భారాన్ని మోపాడని ధ్వజమెత్తారు.

ఈ సభలో టీడీపీ జనసేన నాయకులు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, ప్రత్తిపాటి పుల్లారావు, చిక్కాల రామచంద్రరావు, గొల్లపల్లి సూర్యారావు, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ సీనియర్ నేత జ్యోతుల నెహ్రూ, రాజానగరం జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, టీడీపీ రాష్ట్ర నాయకులు వెలుగుబంటి ప్రసాద్, అన్నందేవుల చంటి, మార్గాని సత్యనారాయణ, శిష్టా లోహిత్, కాశి నవీన్‌కుమార్, అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్, మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చిల్లా జగదీశ్వరి, బండారు సత్యానందరావు, గంటా మురళి, పిల్లి అనంతలక్ష్మి, మాజీ మేయర్ పంతం రజనీశేషసాయి, కొవ్వూరు జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, జోన్ 2 కోఆర్డినేటర్ మందలపు రవి, చెల్లుబోయిన శ్రీను, నాయకులు వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, ప్రత్తిపాటి రామారావుచౌదరి, గట్టి నర్సయ్య, చెరుకూరి రామారావు, నున్న కృష్ణ, పంతం గణపతి, గంగిన హనుమంతరావు, ప్రత్తిపాటి రామారావుచౌదరి, గంగిన రంగయ్యచౌదరి, వాసిరెడ్డి రాంబాబు, వరగోగుల వెంకటేశ్వరరావు, పితాని శివ, మజ్జి పద్మ, రెడ్డి మణి, బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నన్నయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధామూర్తికి గౌరవ డాక్టరేట్

ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్‌నజీర్

ఉపకులపతి పద్మరాజు వెల్లడి



వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, జనవరి 29: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15వ స్నాతకోత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో జరిగే ఈ కార్యక్రమంలో వీసీతో పాటు గవర్నర్ అబ్దుల్‌నజీర్ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు పద్మభూషణ్ సుధామూర్తి హాజరవుతారని, ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నామని చెప్పారు. నన్నయ యూనివర్సిటీలో 2019-20, 2020-21, 2021-22 విద్యా సంవత్సరాలకు చెందిన పీహెచ్‌డీ, పీజీ, పీజీ డిప్లొమా, యూజీ, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన వారికి పట్టాలు అందిస్తామన్నారు. ఈ 13, 14, 15వ స్నాతకోత్సవాలకు వివిధ కోర్సులకు చెందిన 500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరిలో పీహెచ్‌డీ 12, గోల్డ్ మెడల్స్ 12, ప్రైజ్ 12 మిగిలిన వారు పీజీ కోర్సులు, ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్‌ఎల్‌ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్‌ఎల్‌బీ, బీఈడీ వంటి కోర్సులు పూర్తిచేసిన వారు ఉన్నారని తెలిపారు. మూడు విద్యా సంవత్సరాల్లో విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలో పీజీ పూర్తి చేసిన 8582, యూజీ పూర్తి చేసిన 50173 మంది విద్యార్థుల పట్టాలు ఆమోదిస్తారన్నారు. అతిథులుగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయ ప్రముఖులు హాజరవుతారని చెప్పారు. స్నాతకోత్సవానికి సంబంధించి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

గైట్‌లో హెలిప్యాడ్ పరిశీలన



హెలిప్యాడ్ పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజానగరం, జనవరి 29: గైట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఆదికవి నన్నయ విద్యాలయంలో ఈ నెల 31న జరగనున్న స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక సందర్భంగా గైట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను వారు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాధవీలత అధికారులకు పలు సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖరరాజు, డీఎస్పీ కిశోర్‌కుమార్, రాజానగరం సీఐ పి.కాశీ విశ్వనాథ్, తహశీల్దార్ పవన్‌కుమార్, నన్నయ వీసీ పద్మరాజు, రిజిస్ట్రార్ సుధాకర్, గైట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ శర్మ, ఎన్‌సీసీ ఏఎన్‌వో ఏ.తేజేశ్వరరాజు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచబోం

ఈ ఆర్థిక సంవత్సరం భారం ఉండదు

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

2024-25 ఆదాయ అంచనాలు రూ.21,162 కోట్లు

ప్రతిపాదిత ధరల రాబడి రూ.100.44 కోట్లు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై ఈ (2024-25) ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి భారం మోపడం లేదని, చార్జీలు పెంచడం లేదని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో ఏపీఈఆర్సీ సోమవారం నిర్వహించిన టారిఫ్ ప్రతిపాదనల స్వీకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని డిస్కమ్ ప్రగతిని, ప్రతిపాదనలు వివరించారు. కేవలం రైల్వే ట్రాక్షన్ చార్జీలను మాత్రం యూనిట్‌కు రూపాయి పెంచడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల నుంచి యూనిట్‌కు రూ.5.50 మాత్రమే వసూలు చేస్తున్నామని, సర్వీసు ధర 40 శాతం పెరిగిందని, ఈ నేపథ్యంలో పెంపు అనివార్యమన్నారు. దీనివల్ల డిస్కమ్‌కు అదనంగా రూ.100.24 కోట్లు సమకూరుతుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఓల్టేజ్ సర్వీసు వ్యయంతో టారిఫ్‌కు లింకు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ధరల నుంచి రూ.17,854.16 కోట్ల ఆదాయం వస్తుందని, ప్రతిపాదిత ధరల ద్వారా రూ.100.44 కోట్లు, ప్రతిపాదిత రికవరీ నుంచి రూ.3,207.27 కోట్లు కలిపి మొత్తం రూ.21,161.86 కోట్లు వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. రాబడి లోటు ఏమీ లేదని స్పష్టంచేశారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.4.69గా ఉంటుందని, ప్రసారం, పంపిణీ నష్టాల వ్యయం 49 పైసలు, నెట్ వర్క్ ఖర్చులు రూ.1.63, ఇతర ఖర్చులు 28 పైసలు కలిపి సర్వీసు వ్యయం యూనిట్‌కు రూ.7.09 అవుతుందని వివరించారు. సగటున యూనిట్‌కి రూ.6.01 వస్తుందని, రెండింటి మధ్య తేడా యూనిట్‌కి రూ.1.08 ఉంటుందని అంచనా వేశారు.

కాల్వలో కొట్టుకుపోయిన చిన్నారి

కాట్రేనికోన, జనవరి 29: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కుంచనపల్లి వద్ద బొబ్బర్లంక- పల్లంకుర్రు పంటకాల్వలో సోమవారం ఆరేళ్ల చిన్నారి కొట్టుకుపోయినట్టు స్థానికులు తెలిపారు. సంచార జాతులకు చెందిన కుటుంబం ఇక్కడ గుడారంలో నివాసముంటున్నారు. తల్లిదండ్రులు లేని సమయంలో చిన్నారి స్నానం కోసం కాల్వలోకి దిగి అదృశ్యమైనట్టు తెలుస్తోంది. ఎంత గాలించినా పాప ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషన్‌లోని ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం పక్కన ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) సీఐ విజయ్‌శంకర్ తెలిపారు. ఆర్‌పీఎస్ఐ పెబ్బిలి లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 9440627551 నెంబరుకు తెలియజేయాలని ఆయన కోరారు.

రత్నగిరిపై పలు అభివృద్ధి పనులకు ఆమోదం

పాలకమండలి సమావేశంలో వివిధ అంశాలపై చర్చ



పాలకమండలి సమావేశం జరుగుతున్న దృశ్యం

అన్నవరం, జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు పాలకమండలి ఆమోదం లభించింది. ఛైర్మన్ రోహిత్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఈవో రామచంద్రమోహన్ ప్రతిపాదించిన అజెండాపై సభ్యులతో కలిసి చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా కొండదిగువ టోల్‌గేట్ నుంచి సెంటినరీ కాటేజీ వరకు నిర్మించ తలపెట్టిన మెట్లమార్గం అంచనా వ్యయాన్ని రూ.85 లక్షల నుంచి రూ.90 లక్షలకు పెంచేందుకు ఆమోదం లభించింది. రూ.40 లక్షలతో టోల్‌గేట్ వద్ద నుంచి సత్యగిరి జంక్షన్ వరకు ఘాట్‌రోడ్డు పాడవడంతో బీటీ రోడ్డు వేసేందుకు ఆమోదించి దేవదాయ కమిషనర్ అనుమతితో చేపట్టాలని నిర్ణయించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న విద్యాసంస్థల్లో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది జీతభత్యాలకు రూ.90 లక్షలు సప్లిమెంటరీ బడ్జెట్‌కు అనుమతి కోరుతూ ప్రతిపాదించగా నిర్ణయాన్ని కార్యనిర్వహణాధికారికి వదిలివేశారు. సత్యగిరి కొండపై నిర్మించిన శివసదన్ కాటేజీ నందు సూట్‌రూంల అద్దెను 2000 నుంచి 2500కు పెంచాలని నిర్ణయించారు. ఇటీవల నూతనంగా నిర్మించిన ఆదిశంకర్ మార్గ్‌కు భద్రతా ప్రమాణాల దృష్ట్యా రూ.11.91 లక్షలతో క్రాస్ బేరియర్స్ ఏర్పాటుకు పిలిచిన లోయస్టు టెండర్ ఆమోదించారు. రూ.9 లక్షలతో ప్రకాష్‌సదన్ కాటేజీ వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపునకు బీటీ రోడ్డు వేసేందుకు ఆమోదం లభించింది. ఇటీవల దేవస్థానంలో వాహనాల కొనుగోలుకు సంబంధించి అవసరమైన ఇద్దరు డ్రైవర్‌లు, ఇద్దరు కండక్టర్‌లు, ఒక క్లీనర్‌ను ఔట్‌సోర్సింగ్‌పై తీసుకోవాలనే అంశాన్ని ఆమోదించి కమిషనర్ అనుమతి తీసుకోవాలని సూచించారు. రూ.26 లక్షలతో దత్తత ఆలయమైన శంఖవరం ఉమామహేశ్వర దేవస్థానంలో కల్యాణ మండపం అభివృద్ధి పనులు చేపట్టడంపై నియమ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. రూ.3.90 లక్షలతో మిచౌంగ్ తుపాన్ కారణంగా దెబ్బతిన్న ఘాట్‌రోడ్డు పనులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇటీవల పలు వ్యాపార సముదాయాల లైసెన్స్ హక్కులకు నిర్వహించిన వేలం పాటలలో హెచ్చుపాటలను ఆమోదించారు. సమావేశంలో సభ్యులు పేరూరి బద్రీనారాయణ, నక్కా అశ్విని, దోమాడ సుందరరావు, సహాయ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్లాపస్' సేవలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శాశ్వత లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్(ప్లాపస్) సేవలు ప్రజలు వినియోగించుకునే విధంగా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ప్లాపస్‌పై ఉమ్మడి తూర్పుగోదావరిలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులు, ప్రతినిధులతో ఆమె సోమవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థల చట్టం-1987 ద్వారా ఏర్పాటు చేసిన ప్లాపస్ విధులను వివరించారు. విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వైద్యం, తపాలా, టెలిఫోన్, బీమా సంస్థలు, బ్యాంకింగ్ వంటి పది రకాల సేవలకు సంబంధించిన సమస్యలను జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న ప్లాపస్ ద్వారా త్వరగా పరిష్కరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్లాపస్‌కు రూ.కోటి రూపాయల వరకూ వివాదాలు పరిష్కరించే పరిధి ఉందన్నారు. అర్జీదారులు కోర్టు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, రాజీ మార్గంలో వివాద పరిష్కారానికి ప్రయత్నం చేస్తారన్నారు. ఒకవేళ రాజీ కుదరని పక్షంలో విచారణ జరిపి తీర్పు ఇచ్చే అధికారం ప్లాపస్‌కి ఉందని పీడీజే తెలిపారు. ప్లాపస్‌పై ప్రజలు కూడా అవగాహన పెంచుకొని సేవలు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ప్లాపస్ ఛైర్‌పర్సన్ ఏ.గాయత్రి దేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి, డీఈవో ఎస్.అబ్రహాం, కోనసీమ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీధర్, బీఎస్ఎన్ఎల్ జేఏవో వై.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఆధార్ లింక్‌తో 27 విద్యుత్ కనెక్షన్లు

ఆలమూరు, జనవరి 29: ఆయనో వ్యవసాయ కూలీ... కానీ ఆయన ఆధార్ నెంబరుతో ఒకటి కాదు.. రెండు కాదు... ఏకంగా 27 విద్యుత్ కనెక్షన్లు లింకై ఉన్నాయి. దీంతో ప్రభుత్వ పథకాలు రావడం లేదు. లబోదిబోమని విద్యుత్ కార్యాలయానికి వెళితే 27 కనెక్షన్లు ఉన్నాయని అధికారులు చెప్పడంతో వాపోయాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లకు చెందిన గంటా సింహాచలం దాదాపు 2,700 యూనిట్లు విద్యుత్ వాడుకున్నట్టు అధికారులు స్పష్టం చేశారు. దీంతో రాయితీ పథకాలు వర్తించవని చెప్పారు. ఇదేమిటని ఆయన విద్యుత్ శాఖ కార్యాలయానికి పరుగులు తీస్తే రామచంద్రపురం డీఈ ఆఫీసుకు వెళ్లమని చెప్పారు. సింహాచలం అక్కడికి వెళ్తే ఆధార్ నెంబరుతో 27 కనెక్షన్లు లింక్ చేసి ఉన్నాయని చెప్పడంతో అతడు కంగుతిన్నాడు. తనకు ఇన్ని మీటర్లు ఉండటమేమిటని ప్రశ్నించాడు. ఇలా ఎలా జరిగిందో తమకు తెలియదని, గ్రామ సచివాలయంలో ఒక్కో కనెక్షన్‌కు రూ.35 చెల్లించి దరఖాస్తు చేసుకుంటే రద్దు చేస్తామని అధికారులు సెలవిచ్చారు. వారు తప్పు చేసి తనను డబ్బులు చెల్లించి కనెక్షన్లు రద్దు చేసుకోమనడం ఎంతవరకు న్యాయమని సింహాచలం వాపోయాడు.

మహిళపై హత్యాయత్నం: రెండేళ్ల జైలు

సర్పవరం జంక్షన్, జనవరి 29: తనతో సహజీవనం చేస్తున్న వివాహితపై అనుమానంతో హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీఎస్ పద్మజ తీర్పునిచ్చారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఎండపల్లి శివారు తాటూరు గ్రామానికి చెందిన 36 ఏళ్ల కాకాడ వెంకటరమణ అనే వ్యక్తి రమణయ్యపేట ఆర్టీసీకాలనీలో నివాసం ఉంటున్న వివాహితతో ఏడాది పాటు సహజీవనం చేశాడు. అనుమానం పెంచుకున్న వెంకటరమణ 26-10-2022వ తేదీన పిల్లల్ని మోటార్ బైక్‌పై స్థానిక రమణయ్యపేట మున్సిపల్ హైస్కూల్లో దింపి ఇంటికి తిరిగి వస్తున్న తరుణంలో మార్గమధ్యంలో ఇనుపరాడ్డుతో వివాహితను తలపై బలంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ కేసులో బాధితురాలి ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీఎస్ పద్మజ తీర్పునిచ్చినట్లు సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ డానియల్ దినకర్ జాన్సన్ వాదించారు. కోర్టు కానిస్టేబుల్ బి.శ్యామలరావు ఎస్‌హెచ్‌వోను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

వేదికపై తూలిన చంద్రబాబు

వెనుక చెయ్యి పట్టి ఆపిన భద్రతా సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ/రూరల్/కడియం, జనవరి 29: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలో రా.. కదలిరా సభకు విచ్చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు సభ ముగించుకుని వెళుతున్న క్రమంలో నేతల రద్దీతో సభా వేదిక కిక్కిరిసింది. ఈ క్రమంలో ఒకరిద్దరు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చే క్రమంలో కొంత మీదకు రావడంతో ఆయన తూలారు. అప్రమత్తమైన ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది వెనుక నుంచి చెయ్యి అడ్డం పెట్టి బ్యాలెన్స్ తప్పకుండా నిలువరించారు. వెంటనే సిబ్బంది చెయ్యి అడ్డుపెట్టి చంద్రబాబును కాన్వాయ్ వద్దకు తీసుకెళ్లారు.

సాహిత్యం ఉన్నంతకాలం వేటూరి ఉంటారు

● వేటూరి సాహితీ పీఠం పురస్కార గ్రహీత జేకే భారవి



జేకే భారవిని సత్కరించిన ప్రముఖులు

తుని రూరల్, జనవరి 29: 'కలలు చెదిరినా పాటే, కలత చెందినా పాటే'.. ఎలాంటి భావాన్నైనా పలికించగలిగే శక్తి వేటూరికే సాధ్యమని, క్లిష్టమైన, సరళమైన పదాలతో గారడీ చేస్తూ ఆడుకోవడం వేటూరి మాత్రమే చేయగలరని ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు, పాటల రచయిత జేకే.భారవి అన్నారు. సంగీతం, సాహిత్యం ఉన్నంతవరకు వేటూరిని మరిచిపోలేమని అన్నారు. సోమవారం కాకినాడ జిల్లా తునిలోని చిట్టూరి మెట్రోలో వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేటూరి జయంతి వేడుకల్లో ఈ ఏడాది త్రయోదశ(13వ) వేటూరి కవితా పురస్కారాన్ని జేకే భారవి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటూరి వారి పురస్కారానికి తనను ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నేటి యువతకు గాయకులుగా, గేయ రచయితలుగా చాలా అవకాశాలున్నాయని చెప్పారు. కవులకు ధనం ముఖ్యం కాదని, వారి వారి వాక్చాతుర్యం, రచనా శైలి నిజమైన సంపద అని అన్నారు. అన్నమయ్య, రామదాసు, మంజునాథ సినిమాలకంటే ఆదిశంకరాచార్య సినిమాకు యూట్యూబ్ వీక్షకులు ఎక్కువ ఉండడం తనకు వచ్చిన విజయంగా భావిస్తున్నానని అన్నారు. తెలుగు పాటకు వన్నె తెచ్చిన వ్యక్తిగా వేటూరి చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అన్నవరం దేవస్థానం అదనపు కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్, రసమాధురి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరాల సీతారామప్రభు మాట్లాడుతూ వేటూరి మన మధ్య లేకపోయినా పాటల రూపంలో బతికే ఉన్నారని, కవులు ఉన్నంతకాలం తెలుగు భాష వైభవం తగ్గదని అన్నారు. అనంతరం సన్మాన గ్రహీత జేకే భారవిని తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు ప్రముఖులు పుస్తకాలతో ఘనంగా సత్కరించారు. వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు చక్కా సూర్యనారాయణ, శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి, వేటూరి సాహితి పీఠం ప్రధాన కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మతో పాటు తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

మళ్లీ పెద్దపులి జాడలు



గాలింపు చర్యల పర్యవేక్షణ

విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు

నల్లజర్ల, జనవరి 29: పెద్ద పులి వచ్చిన జాడలు మళ్లీ కనిపించినట్టు డీఆర్‌వో వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ రాత్రి నల్లజర్ల మండలం పుల్లలపాడు, నల్లజర్ల పరిసర ప్రాంతాల్లో పెద పులి సంచరిస్తున్నట్టు ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం నిజమైంది. శుక్రవారం ద్వారకాతిరుమల మండలం వైపు వెళ్లిన పెద్ద పులి తిరిగి అయ్యవరం మీదుగా పుల్లలపాడు వైపు వచ్చినట్టు డీఆర్‌వో చెప్పారు. పులి పాదముద్రలు సేకరిస్తున్నామని, ప్లెగ్ మార్క్స్ సేకరించి ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పులిని పట్టుకునేందుకు ప్రభుత్వం ఒక బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇదిలా ఉండగా ఏలూరు డీఎఫ్‌వో రవీంద్రదామ తన బృందంలో పులి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం అయ్యవరం-దూబచర్ల గ్రామాల మధ్య ఉన్న ఆయిల్‌పామ్ తోటల్లో పులి పాదముద్రలు ఉన్నట్టు గుర్తించారు. అక్కడ ట్రాప్ కెమెరా అమర్చారు. ఆయన వెంట డీఆర్‌వో వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి రత్నం ఉన్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం పెరుగూడెంలో పెద్ద పులి ఉన్నట్టు సమాచారం రావడంతో వెంటనే బయలుదేరి వెళ్లారు. తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో రెండు పెద్ద పులులు ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

క్షుద్ర పూజల కలకలం



పెద్దాపురం, జనవరి 29: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని కాండ్రకోట గ్రామంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. తమ ఇళ్ల ముందు ముగ్గులు, ఎండు మిరపకాయలు, కుంకుమ, పసుపు మొదలయిన వాటిని పెట్టి క్షుద్ర పూజలు చేస్తున్నారని పలువురు ఆరోపించారు. అర్ధరాత్రి సమయంలో ఎవరో ఈ పనులు చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వెలుగుల సురేష్ గ్రామానికి చేరుకుని ఆరా తీశారు. మూఢ నమ్మకాలను నమ్మవద్దని ప్రజలకు తెలియచేశారు. గ్రామంలో పోలీసు పహారా ఏర్పాటు చేస్తామన్నారు.

తూర్పుగోదావరి

నిడదవోలు వాసవీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నిడదవోలు, జనవరి 29: నిడదవోలులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. అధ్యక్షుడిగా బచ్చు లక్ష్మణరావు (నాని), కార్యదర్శిగా ఉప్పల సతీష్, కోశాధికారిగా కేదారిశెట్టి సత్యనారాయణ, పలువురు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

ఐటీడీఏ స్పందనకు 61 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, జనవరి 29: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 61 అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఆయన సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి స్పందన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రబ్బరు మొక్కలు మంజూరు చేయాలని, నేషనల్ హైవే 516 రోడ్డులో కోల్పోయిన భూములకు నష్టపరిహారం చెల్లించాలని, అర్హులైన గిరిజనులకు 5 కేజీల గ్యాస్ పంపిణీ చేయాలని, పందిరిమామిడి-చవిటిదిబ్బలు రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, చెరువుపాలెంలో ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో ఎస్డీసీ డీఎస్ శాస్త్రి, డీడీ అబుసలాం, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, డీఈవో మల్లేశ్వరరావు, డీఎల్‌పీవో రాఘవన్, ఈఈలు జి.డేవిడ్‌రాజు,సుబ్బయ్య, ఎ.రవికుమార్, ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి, పీఏవో రాంబాబు, సీడీపీవో సంధ్యారాణి జీసీసీ మేనేజర్ ముర్ల నాగవెంకటరాజారెడ్డి, డీఈఈలు సాయి సతీష్, రాజేంద్రబాబు, మల్లికార్జునరావు, రామచంద్రమూర్తి, లీగస్ సెల్ డీటీ స్వామి, ఏఈ పి.వెంకటరమణ, న్యాయవాది ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కుళాయిలు ఏర్పాటు చేయాలి

రంపచోడవరం, జనవరి 29: జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని టీడీపీ మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు సోమవారం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరేకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పెదగెద్దాడ పంచాయతీ చెరువుపాలెంలో జలజీవన్ మిషన్ ద్వారా కొంతమందికి మాత్రమే కుళాయిలు ఏర్పాటు చేసి కొన్ని ఇళ్లకు కలెక్షన్లు ఇవ్వకపోవడంపై పీవోకు ఫిర్యాదు చేశారు. మండల మహిళా టీడీపీ అధ్యక్షురాలు వంతల అచ్చియమ్మ, అన్నిక అప్పారావు, కాకర అబ్బులు, కాకర రాజబాబు, నెరం శేఖర్, పసికోన రమణకుమార్, అన్నిక దుర్గారావు, కత్తుల కొమ్మిరెడ్డి, తుంబుడు రామకృష్ణారెడ్డి, కత్తుల కొమ్మిరెడ్డి, కాకర ప్రసాద్‌బాబు పీవోను కలిశారు.

'పరీక్షాపే చర్చ'లో విద్యార్థులు



కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రా విద్యార్థులు

వై.రామవరం, జనవరి 29: ఢిల్లీలో సోమవారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరీక్షాపే చర్చా వేదికకు అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పి.ఎర్రగొండ గిరిజన సంక్షేమ శాఖ ఏకలవ్య పాఠశాల విద్యార్థులు నలుగురు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సీబీఎస్ఈ సిలబస్‌కు చెందిన పది మంది విద్యార్థులు ఎంపిక కాగా వారిలో నలుగురు తమ పాఠశాల నుంచే ఎంపిక కావడం గర్వకారణమని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ అన్నారు. కుంచె మణిదీప్, వేమ లక్ష్మణరెడ్డి, పండా రాహుల్‌దొర, పాండులోవ వెంకటకిశోర్‌కు ఈ అరుదైన అవకాశం దక్కిందని చెప్పారు. విద్యార్థుల వెంట ఎస్కాట్ టీచర్‌గా అరకు స్పోర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

రిపబ్లిక్‌డే వేడుకల్లో విద్యార్థులు



ఐటీడీఏ పీవోను కలిసిన విద్యార్థులు

రంపచోడవరం, జనవరి 29: ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌డే వేడుకల్లో ఏజెన్సీ నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థులను ఎంపిక చేసి ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ వేడుకలకు పంపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.అబుసలాం, ఫిజికల్ డైరెక్టర్లు కె.తిరుపతిరావు, కె.రామాయమ్మ, డిప్యూటీ వార్డెన్ ఆదినారాయణరెడ్డి, పీఈటీ మల్లేశ్వరి పాల్గొన్నారు.

రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహల్లి బదిలీ

నూతన ఏఎస్పీగా ధీరజ్



ధీరజ్

రంపచోడవరం, జనవరి29: రంపచోడవరం సబ్ డివిజన్ ఏఎస్పీగా ఉన్న జగదీష్ అడహల్లిని పాడేరు సబ్ డివిజన్ ఏఎస్పీగానూ, అక్కడ ఉన్న ధీరజ్ కునుబిల్లిని రంపచోడవరం ఏఎస్పీగానూ నియమిస్తూ ప్రభుత్వం పరస్పర బదిలీని చేపట్టింది. సోమవారం రాత్రి ఈ బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఇరువురు 2020 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారులు. 2023 ఏప్రిల్‌లో జరిగిన బదిలీలలో రంపచోడవరం, పాడేరు సబ్ డివిజన్లకు బదిలీ అయ్యారు.

గుర్తేడులో కమ్యూనిటీ పోలీసింగ్

మారేడుమిల్లి,జనవరి 29: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు గుర్తేడు గ్రామంలో సోమవారం కమ్యూనిటీ పోలీసింగ్‌ను నిర్వహించారు. పోలీసులు వైద్య శిబిరం, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడంతో పాటు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పాతకోట, బొడ్డగొంది, ధారగడ్డ పంచాయతీలకు సంబంధించిన 36 టీమ్‌లు ఇందులో పాల్గొన్నాయి. గుర్తేడు, బొదులూరు పీహెచ్‌సీ డాక్టర్ వైద్యాధికారులు రాజేష్, సుబ్రహ్మణ్యం వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంపచోడవరం అదనపు ఎస్పీ జగదీష్ అడాహల్లి హాజరయ్యారు. గ్రామస్థులతో భోజనం చేశారు. వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐలు సంతోష్, సాయికృష్ణ, రాము, పోలీస్ సిబ్బంది , గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముగ్గురు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు

- రంపచోడవరం ఐటీడీఏ పీవోను ఆదేశించిన కలెక్టర్

పాడేరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల పంపిణీలో అలక్ష్యంగా వున్న అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవోను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం తన నివాసం నుంచి పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో కొత్తగా మంజూరైన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను లబ్ధిదారులకు అందించాలన్నారు. వాటి పంపిణీలో నిర్లక్ష్యంగా వున్న అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను ఆదేశించారు. అలాగే ఐటీడీఏ పీవో పీహెచ్‌సీలను సందర్శించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితులను స్వయం తెలుసుకునేందుకు గాను ఆ ప్రాంతంలో నలుగురితో కూడిన బృందం రాత్రి బస చేయాలన్నారు. అయితే రాజకీయ పార్టీలతో సంబంధం లేని వ్యక్తుల ఇళ్లల్లో మాత్రమే బస చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని దారులు అటువైపే..

బాబు సభకు భారీగా తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు, జన సైనికులు



బొడ్డు వెంకట రమణచౌదరి ఆధ్వర్యంలో తరలివెళుతున్న తెలుగుతమ్ముళ్లు

రాజానగరం, జనవరి 29: రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్వహించిన రా..కదలిరా బహిరంగ సభకు రాజానగరం నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తెలుగుదేశం పార్టీ నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మోటార్ సైకిల్, కార్లు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. అలాగే జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తుల వెంకటరమణ ఆధ్వర్యంలో జనసైనికులు భారీ మోటార్ సైకిల్ ర్యాలీగా బయలుదేరి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కందుల బాబూరాయుడు, నాయకులు మద్దిరెడ్డి చిన వెంకటేశ్వరరావు, నూనె వెంకన్న, నీలపాల అరవరాజు, సోడసాని త్రిమూర్తులు, పాతూరి నవీన్‌చౌదరి తదితరులు సభకు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.



బలభద్రపురంలో జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

అనపర్తి, జనవరి29: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో చంద్రబాబు రా కదలిరా బహిరంగ సభకు అనపర్తి నుంచి భారీగా టీడీపీ జనసేన శ్రేణులు బైక్‌లు, కార్లు, బస్సులపై బయలుదేరివెళ్లారు. అనపర్తి నియోజకవర్గం నుంచి మూడు మండలాలు కలిసేవిధంగా అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల మీదుగా భారీ బైక్ ర్యాలీతో ఇరు పార్టీల శ్రేణులు బయలుదేరివెళ్లారు. అనపర్తిలోని కొత్తూరు పెట్రోలు బంకు వద్ద నుంచి అనపర్తి మండల కార్యకర్తలతో కలిసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన తనయుడు మనోజ్‌రెడ్డితో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. బిక్కవోలు మండలం బలభద్రపుం వద్ద నుంచి బిక్కవోలు, పెదపూడి కార్యకర్తలు అనపర్తి నుంచి వచ్చిన ర్యాలీలో జతకట్టి సభకు పయనమయ్యారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 15 వేల మంది కార్యకర్తలు బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, వైజాగ్ శ్రీను, బిక్కవోలు మండల పార్టీ అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ఎస్టీరాజాపురంలో స్థానిక టీడీపీ నాయకులతో ముచ్చటిస్తున్న నల్లమిల్లి

టీడీపీ భారీ ర్యాలీ.. స్తంభించిన ట్రాఫిక్

రంగంపేట, జనవరి 29: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కాతేరు తిరుమల కాలేజీ దగ్గర సోమవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన రా..కదలిరా భారీ బహిరంగ సభకు రంగంపేట మండలం నుంచి తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు బైక్‌లు, ఆటోలు, కార్లు, బస్సుల్లో భారీగా బయలుదేరి ర్యాలీగా వెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నాయకులంతా ఎస్టీ రాజాపురం చేరుకొని అక్కడ నుంచి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. దీంతో రాజానగరం హైవే ట్రాఫిక్‌తో స్తంభించింది. బహిరంగ సభకు వచ్చిన వారందరికీ ఎస్టీరాజాపురం గ్రామంలో భోజనాలు ఏర్పాటుచేశారు.



కడియం నుంచి ర్యాలీగా వెళుతున్న టీడీపీ, జనసేన శ్రేణులు

బాబు సభకు భారీగా టీడీపీ, జనసేన శ్రేణులు

కడియం, జనవరి 29: రాజమహేంద్రవరంలో జరిగిన రా... కదలిరా... చంద్రబాబు సభకు కడియం మండలం నుంచి టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. కడియం నుంచి టీడీపీ రాష్ట్ర నాయకులు వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి నాని, జనసేన మండల అధ్యక్షుడు ముద్రగడ జమీ, టీడీపీ, జనసేన నాయకులు తరలివెళ్లారు. వెలుగుబంటి ప్రసాద్, వెలుగుబంటి నానిలు చంద్రబాబుకు మొక్కను అందజేశారు. అలాగే మాధవరాయుడుపాలెం నుంచి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి 20 ఆటోలు, నాలుగు కార్లు, మోటారుసైకిళ్లతో ర్యాలీగా కాతేరు తరలివెళ్లారు. కాతేరు సభలో చంద్రబాబుకు ప్రత్యేకంగా తయారు చేయించిన నాగలిని, వరికంకులతో చేయించిన కుచ్చును అందజేశారు. అదేవిధంగా కడియపులంక నుంచి టీడీపీ రాష్ట్ర నాయకులు మార్గాని సత్యనారాయణ, జనసేన నాయకులు వైస్ ఎంపీపీ పంతం గణపతి, పాటంశెట్టి రాంజీలు కాతేరు సభకు వెళ్లారు. రాష్ట్ర నాయకులు మార్గాని సత్యనారాయణ పుష్పగుచ్ఛాన్ని చంద్రబాబుకు అందజేశారు. కాతేరులో రా. కదలిరా.. సభకు తరలివెళ్లిన వారిలో వరగోగుల వెంకటేశ్వరరావు, దొంతంశెట్టి శ్రీను, పితాని శివరామకృష్ణ, గోరు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



మధురపూడి రోడ్‌లో చంద్రబాబుకు జనసేన గజమాల స్వాగతం

చంద్రబాబునాయుడుకు జనసేన అపూర్వ స్వాగతం

కోరుకొండ, జనవరి 27: రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో ఏర్పాటు చేసినా రా కదలిరా బహిరంగ సభకు విచ్చేసిన టీడీపీ జాతీయ నాయకులు నారా చంద్రబాబునాయుడుకు మధురపూడి విమానాశ్రయం వద్ద జనసేన ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి అపూర్వ స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో కాతేరుకు బయల్దేరి వెళుతున్న చంద్రబాబునాయుడుకు మధురుపూడి, గాడాల, పోలమూరు, కొంతమూరు గ్రామాల్లో జనసైనికులు, వీర మహిళలు, టీడీపీ కార్యకర్తలు క్రేన్ సహాయంతో గజమాల వేసి స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి సభా ప్రాంగణం వరకు వేలాదిగా జనసైనికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు స్వాగతం పలికిన వారిలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, తోట పవన్‌కుమార్, మింగి లక్ష్మీనారాయణ, కార్యకర్తలు ఉన్నారు.



వైసీపీని వీడి జనసేనలోకి చేరిన వారితో బత్తుల బలరామకృష్ణ

జనసేనలో చేరిన పలువురు నాయకులు, కార్యకర్తలు

కోరుకొండ, జనవరి29: రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం రాత్రి జనసేనలోకి చేరారు. ఈమేరకు రాజానగరం జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలన పట్ల, నేతల తీరు పట్ల విసుగు చెంది విరక్తి కలిగి జనసేనలోకి వచ్చామన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆశయాలు తమను నచ్చాయన్నారు. బడుగు బలహీన వర్గాలకు చేయూతనందిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నబత్తుల బలరామకృష్ణ నాయకత్వంలో పనిచేయాలని పార్టీలోకి వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఆవభూముల పోరాట నాయకుడు అడపా శ్రీనివాస్, జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులు పాల్గొన్నారు.

పదవులు ఊడాక బీసీ అస్తిత్వం గుర్తొచ్చిందా ?

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 29: నేడు అధికార, ప్రతిపక్ష పార్టీల్లో పదవులు అనుభవించిన కొందరు బీసీ నాయకులకు ఆ పదవులు ఊడిపోయాక మాత్రమే బీసీ అస్తిత్వం గుర్తుకురావడం శోచనీయం అని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఎద్దేవా చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్ సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధిపత్య కులాల పార్టీలు విదిల్చిన అధికార పదవులు అనుభవిస్తున్నంతకాలం ఆ బీసీ నాయకులకు బీసీల బాధ గురించిగానీ, వారి సామాజిక ఆర్థిక సమస్యల గురించిగానీ ఏ మాత్రం పట్టించుకోకుండా పార్టీల అధినాయకుల మెప్పుకోసం వెంపర్లాడుతున్నారని మండిపడ్డారు. అటువంటి వారు చట్టసభల్లో ప్రతినిధులుగా ఉన్నంతకాలం బీసీల న్యాయమైన డిమాండ్ల గురించి నోరు మెదపరని అన్నారు. ఇలాంటి దుస్థితి పునరావృతం కాకుండా బీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు ఐక్యంగా పోరాడాలన్నారు. లేకుంటే చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో వంకా మల్లిబాబు పాల్గొన్నారు.

'ఆదివాసీ గిరిజన తెగలకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలి'

రాజమహేంద్రవరం సిటీ, జనవరి29: ఆదివాసీ గిరిజన తెగలకు అంత్యోదయ అన్నయోజనా కార్డులివ్వాలన్న ఆదేశాలున్నప్పటికీ మంజూరు చేయడం లేదని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ ఆరోపించారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నెల పొడవునా రేషన్ దుకాణాలు తెరచేఉండాలని ఏదో ఒక సమయంలో సరుకులు ఆదివాసీ, గిరిజన తెగలు తీసుకెళతారన్నారు. 2006లో 15,57,800 అంత్యోదయ కార్డులు మంజూరుచేశారని, తర్వాత వివాహమైన పీవీటీజీ ఎవ్వరికీ అంత్యోదయ కార్డులు మంజూరు చేయలేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రభుత్వాలు ధిక్కరించాయన్నారు. అంత్యోదయ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి అరగంటి వీరభద్రారెడ్డి, కచ్చల అబ్బాయిరెడ్డి, మామిడి చిన్నారెడ్డి, తాళ్లూరి మంగాయమ్మ, కుళ్ళ చిరంజీవిరెడ్డి, పాల్గొన్నారు.



నన్నయలో స్నాతకోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

దివాన్‌చెరువు, జనవరి29: నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగే స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్ పర్యటనకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత కోరారు. నన్నయలో జరుగుతున్న ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజుతో కలసి కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా గవర్నర్ పర్యటన కోసం అందరూ పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గైట్‌లో ఏర్పాటుచేసిన హెలిపాడ్ వద్ద గవర్నర్‌కు స్వాగతం పలుకుతామని, అనంతరం నన్నయ స్నాతకోత్సవ వేదికకు రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజశేఖర్, టూరిజం ఆర్డీ వి.స్వామినాయుడు, ఆర్‌అండ్‌బీ ఈఈ ఎస్‌బీవీ రెడ్డి, వైద్యఆరోగ్యశాఖ జిల్లా అధికారులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఎస్.సనత్‌కుమారి, నన్నయ రిజిస్ట్రార్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల అసోసియేషన్ ధర్నా

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 29: రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ వద్ద రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ (అమరావతి) పిలుపుమేరకు గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ధర్నా చేసింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేజీకే మూర్తి, కార్యదర్శి ఎం.పార్వతి, కోశాధికారి నారాయణ మూర్తి, ఉపాధ్యక్షుడు కొండపల్లి సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీ ఎండీ అక్బర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు కేకే సంజీవరావులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. 11వ పీఆర్‌సీలో 2022 జనవరి 1 నుంచి తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను యథావిధిగా 70 ఏళ్ల వయస్సు వారికి 10 శాతం, 70 ఏళ్లు నిండిన వారికి 15 శాతం గతంలో ఇచ్చినట్టు యథావిధిగా పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, హెల్త్‌కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపుపొందిన ఆస్పత్రుల్లో క్యాష్ లెస్ వైద్యం అందించాలని, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ పరిధిని 2 లక్షల నుంచి 5 లక్షల రూపాయలకు పెంచాలని, వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లకు వైద్యం, మందుల ఖర్చులకు చాలా ఇబ్బంది పడుతున్నందున ప్రతీ నెలా ఒకటవ తేదీనే పెన్షన్ చెల్లించాలని వారు కోరారు.



ప్రధాన రహదారిపై బైఠాయించిన మహిళలతో చర్చిస్తున్న అధికారులు

ఇళ్ల పట్టాల కోసం మహిళల ఆందోళన

గోకవరం, జనవరి29: తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల పట్టాలను వెంటనే పంపిణీ చేయాలని డిమాండు చేస్తూ సోమవారం గోకవరంలోని మురళీనగర్‌కు చెందిన పలువురు మహిళలు పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. స్థలాలను కేటాయించినట్టు చెప్పడమే తప్ప ఇంతవరకు పట్టాలు మాత్రం చేతికివ్వలేదంటూ ఆందోళనకారులు అధికారులపై మండిపడ్డారు. ఆ సమయంలో పంచాయతీ అధికారులకు, ఆందోళనకారులకు మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసారావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల పంపిణీకి, పంచాయతీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులదే పూర్తి బాధ్యత అని చెప్పుకొచ్చారు. దీంతో బాధిత మహిళలు తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామంటూ పంచాయతీ కార్యాలయం ముందున్న ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీనివల్ల వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. చివరకు తహశీల్దారు శ్రీనివాస్, ఎస్‌ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన స్థలం కోర్టు వివాదంలో ఉందన్నారు. ఆ స్థలానికి ప్రత్యామ్నాయంగా తంటికొండ వెళ్లే రహదారి పక్కన స్థలాన్ని పరిశీలించామని, ఆ స్థలాన్ని జగనన్న లబ్ధిదారులందరికీ కేటాయించడం జరుగుతుందని చెప్పడంతో ఆందోళన సర్దుమణిగింది.

బీజేపీలో చేరిక

రంగంపేట, జనవరి29: మండలంలోని పెదరాయవరం గ్రామానికి చెందిన బచ్చల విజయ్ టీడీపీకి చెందిన సోషల్ మీడియా ఆక్టివిస్ట్‌గా పనిచేస్తున్నారు. సోమవారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎంఎస్‌ఆర్‌కే రాజు ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి హారిక, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మద్దిపాటి రజని, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సుమన్, జిల్లా కార్యదర్శి గౌలి దుర్గారావు, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు వరప్రసాద్, మండల అధ్యక్షుడు సాయిరాం పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ చెక్కుల పంపిణీ

బిక్కవోలు, జనవరి 29: ఆరికరేవుల, మెళ్లూరు గ్రామాల్లోని డ్వాక్రా మహిళలకు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నాల్గవ విడత వడ్డీ రాయితీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరికరేవులలో 1523 గ్రూపులకు రూ.14.38 కోట్లు, మెళ్లూరులో 1523 గ్రూపులకు రూ.14.38 కోట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రొంగల పద్మావతి, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు పెద్దిరెడ్డి సత్యసాయిరాం, కొమ్మన ఆనంద్, వైసీపీ నాయకుడు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15న మోదీ హఠావో - దేశ్ బచావో సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 29 : రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, లౌకికత్వం, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మంటగలుపుతోందని భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు విమర్శించారు. సోమవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.మధు, కాంగ్రెస్ నాయకుడు మురళీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టి ప్రధాని మోదీ ఆంధ్రరాష్ట్రానికి తీవ్రమైన ద్రోహం చేశారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. ఈమేరకు ఫిబ్రవరి 15న మోదీ హఠావో, దేశ్ బచావో అనే నినాదంతో రాజమహేంద్రవరంలో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సీపీఎం సీనియర్ నేత ఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

నిందితులను వెంటనే శిక్షించాలి

దివాన్‌చెరువు, జనవరి29: అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి కర్నూలు జిల్లా ఆదోనిలో అవమానం జరగడం పట్ల ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బలభద్ర వీర వెంకట సత్యనారాయణ సోమవారం తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. భాషాప్రయుక్తరాష్ట్రాల అవిర్భావానికి కారకుడైన శ్రీరాములుని నిత్యం స్మరించుకోవలసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. అటువంటి మహనీయుని విగ్రహానికి అవమానం జరగడం తనను ఎంతగానో కలచివేస్తోందన్నారు. నిందితులను తక్షణమే శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆర్టిఫిషియల్ జ్యుయలరీ మేకింగ్ కోర్సులో శిక్షణ

రాజమహేంద్రవరంఅర్బన్, జనవరి29: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించే ఆర్టిఫిషియల్ జ్యుయలరీ మేకింగ్ కోర్సుకు తమ కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థినిలు ఎంపికయ్యారని, నెలరోజులపాటు ఈ శిక్షణ ఉంటుందని ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. విద్యార్థినిలు క్రియాత్మక నైపుణ్యాలను మెరుగుపర్చుకుని, ఆర్థికసాధికారత సాధించాలని ఆకాంక్షించారు. శిక్షణా కార్యక్రమానికి గ్రీన్ లీఫ్ సొల్యూషన్స్ వ్యవస్థాపకురాలు ఎన్.శ్రీదేవి, ప్రియాస్ ఫ్లోరల్ సొల్యూషన్స్ వ్యవస్థాపకురాలు ఎన్.ప్రియ రిసోర్సుపర్సన్లుగా వ్యవహరిస్తున్నారు. కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అన్నపూర్ణ, కామర్స్ లెక్చరర్ కె.సునీత, ఎ.రాజేశ్వరి, బి.మల్లిఖార్జున పాల్గొన్నారు.

మెళ్లూరు సొసైటీలో వడ్డీ రాయితీ, డివిడెండ్ పంపిణీ

బిక్కవోలు, జనవరి 29: మెళ్లూరు సొసైటీలో 350 మంది రైతులకు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వడ్డీ రాయితీ, డివిడెండ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వడ్డీరాయితీ రూ. 5 లక్షలు, డివిడెండ్ రూ. 1.50 లక్షలు పంపిణీ చేశారు. సొసైటి చైర్‌పర్సన్ వస్సే సత్యనారాయణ, సర్పంచ్ పెద్దిరెడ్డి సత్యసాయిరాం, ఉప సర్పంచ్ కొమ్మన ఆనంద్, వైసీపీ నేతలు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, రొంగల అప్పాజీ, బొడ్డు ముత్యాలరావు, కొమ్మన లక్ష్మీనారాయణ, సీవో కొర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సైంధవ్
సూర్యామినీ	: 105 మినిట్స్
సూర్యాప్యాలస్	: ఫైటర్
స్వామి	: హనుమాన్
శివజ్యోతి	: హాయ్ నాన్న
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	: సలార్
ఊర్వశి	: నా సామి రంగ
రంభ	: కెప్టెన్ మిల్లర్
మేనక	: హనుమాన్
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: గుంటూరు కారం
వీఎస్ మహాల్(నామవరం)	: హనుమాన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: నా సామి రంగ
వెంకటసూర్య(కడియం)	: హనుమాన్
సత్యగౌరి (అనపర్తి)	: గుంటూరు కారం
సూర్యశ్రీ (అనపర్తి)	: గుంటూరు కారం
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: గుంటూరు కారం
రామకృష్ణ(కోరుకొండ)	: సైంధవ్
గీతాసినిమాస్ (సీతానగరం)	: సైంధవ్
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: గుంటూరు కారం
లలితామహాల్(రంపచోడవరం)	: సైంధవ్
నవయుగ(చింతూరు)	: హనుమాన్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు


మంగళవారం 30 జనవరి 2024 | 5



మనదే విజయం : టీడీపీ జెండాతో మహిళ



ఇది నా టీమ్ : వేదికపై చంద్రబాబుతో గోరంట్ల, యనమల, చినరాజప్ప, రామకృష్ణారెడ్డి, ఆదిరెడ్డి అప్పారావు, మద్దిపాటి వెంకటరాజు, కందులదుర్గేష్, జోన్-2 కోఆర్డినేటర్ మందలపు రవి, ప్రత్తిపాటి, బాపిరాజు, ఆర్ఎస్, యర్రా, హరీష్‌మాధుర్, బండారు తదితరులు





మీరే మా దైవం : ఎన్టీఆర్ విగ్రహానికి నమస్కరిస్తున్న చంద్రబాబు నాయుడు

కిక్కిరిసిన కాతేరు రోడ్డు



మీకు నేనున్నా : రాజమహేంద్రవరంలో జరిగిన రా కదలిరా సభలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

జన గోదారి

తెలుగుదేశం పిలిచిందని.. కదిలొచ్చిన జనం

- జనచంద్రమైన రాజమహేంద్రి
- వేలాది వాహనాల క్యూ
- లక్షలాదిగా జన ప్రవాహం
- దారులుగా మారిన చేల గట్లు
- కిక్కిరిసిపోయిన కాతేరు
- గామన్ బ్రిడ్జి మీదుగా ట్రాఫిక్
- టీడీపీ, జనసేన జెండాల హోరు
- అధిక సంఖ్యలో మహిళల హాజరు

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/అర్బన్/రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం/కొవ్వూరు/తాళ్లపూడి, జనవరి 29 : గోదావరితీరం.. జనగోదారిగా మారిపోయింది.. రాజమహేంద్రవరం నగరం జనంతో పోటెత్తింది. దారులన్నీ జనదారులుగా మారిపోయాయి. వాహనాలు కిలోమీటర్ల లెక్కన బారు లు తీరాయి. ఎటుచూసినా, ఎక్కడ చూసిన జనమే. చేల గట్లు రహదారులయ్యాయి. రా కదలిరా సభా ప్రాంగణం అంతా జై టీడీపీ, జై జనసేన నినాదాలతో హోరెత్తింది. చంద్రబాబు 'రా.. కదలిరా' సభ జన 'చంద్ర'మైంది. మహిళాలోకం వెల్లువలా తరలివచ్చింది. వయసు పైబడిన పెద్దలు సైతం ఉత్సాహంగా కదలి వచ్చారు. రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో సోమవారం ఉదయం 10 గంటలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు "తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా" సభ నిర్వహించారు. సభ జరిగే ప్రదేశం చంద్రబాబు రాకకు రెండు గంటల ముందే జనంతో కిటకిటలాడింది. చంద్రబాబు సభను విశాలమైన మైదానంలో ఏర్పాటు చేసినా జన ప్రభంజనంతో నిండిపోయింది. సభా ప్రాంగణం కాతేరు ప్రధాన రహదారి పక్కనే ఉన్నా ఎటు చూసినా జనంతో నిండిపోవడంతో పొలం గట్లతో సహా అందుబాటులో ఉన్న అన్ని దారుల్లోనూ పసుపు దండు, జనసైనికులే కనిపించారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలే కాకుండా, మిగిలిన జిల్లాల నుంచి కార్లు, బైక్‌లు, బస్సులు, ఆటోలు చివరకు సైకిళ్లపై కూడా టీడీపీ, జనసేన కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. ప్రతి నియోజకవర్గం నుంచి 30 వేల మంది వస్తారని అంచనా వేయగా దాని తగినట్లుగానే తరలివచ్చారు. టీడీపీ, జనసేన జెండాలతో సభా ప్రాంగణం కళకళలాడింది.. జై చంద్రబాబు, జై పవన్‌కల్యాణ్, జై తెలుగుదేశం, జై జనసేన అంటూ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. ఉదయం 10:30 గంటలకు సభ ప్రారంభం అయ్యే సమయానికి ఇటు కొవ్వూరు, కొంతమూరు, నాలుగోబ్రిడ్జి రోడ్డు, కాతేరు, సీతానగరం రోడ్డు, వాహనాలతోను, కార్యకర్తల ప్రదర్శనలతోను కిక్కిరిసింది.భారీ స్థాయి ఊరేగింపులు జరిగాయి.. రూరల్ మండలం ధవళేశ్వరం నుంచి, కడియం, రాజానగరం, సీతానగరం, రాజమహేంద్రవరం అర్బన్, కోరుకొండ మండలాలతో పాటు అటు కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం, తాళ్లపూడి తదితర మండలాల నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు నాయకులు భారీ ప్రదర్శనలు నిర్వహిస్తూ కాతేరు చేరుకున్నారు. దీంతో ఆయా రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. సభ ముగిసిన తరువాత సుమారు గంట పాటు రహదారులన్నీ జనంతో నిండిపోయాయి. అటుపై మధ్యాహ్నం 2-30 , 3 గంటల మధ్య సాధారణ స్థితికి వచ్చింది. స్థానిక లూథర్‌గిరి కాంపౌండ్ నుంచి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెకటరీ ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ప్రసంగాన్ని జనం తదేకంగా విన్నారు. ప్రధానంగా మహిళలు చంద్రబాబును చూడడానికి ఉత్సాహం చూపించారు. నాయకులు ఊహించినదానికంటే జనం భారీగా తరలిరావడంతో కొన్ని చోట్ల ఫెక్సీలను సైతం పక్కకు పెట్టాల్సి వచ్చింది. ఎండ కాస్త ఎక్కువగా ఉన్నా లెక్కచేయకుండా చంద్రబాబు స్పీచ్ వినడానికి ఆసక్తి చూపించారు. చంద్రబాబు సైతం జనాలను ఉత్సాహపరుస్తూ అధికార పార్టీని కడిగిపాడేశారు. మధ్యమధ్యలో జగన్‌పై అయన పేల్చిన హాస్యపు తూటాలకు జనం కేరింతలు కొట్టారు. పెద్ద సంఖ్యలో రెపరెపలాడిన టీడీపీ, జనసేన పార్టీల జెండాలు గెలుపు మనదే అన్నట్టుగా ఉండడంతో తెలుగు తమ్ముళ్లు, జనసైనికుల్లో గోదారిలా ఉత్సాహం ఉప్పొంగింది. భారీగా తరలివచ్చిన జనం ఇబ్బందిపడకుండా వందలాది ప్యాకెట్ల మజ్జిగ, మంచినీళ్ల బాటిళ్లు, బస్తాలకొద్దీ వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలోనూ వివిధ ప్రాంతాల నుంచి జనం సభకు వస్తూనే ఉండడం గమనార్హం. ప్రవేశ ద్వారాలు ఎక్కువగా ఏర్పాటు చేయడం, ప్రాంగణం విశాలంగా ఉండడం, పార్కింగ్ ప్రణాళికాబద్ధంగా ఉండడంతో ఎవరికీ ఇబ్బంది కలగలేదు. చంద్రబాబు వెళ్లిన తర్వాత ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పోలీసులు ట్రాఫిక్‌ని నాలుగో వంతెన మీదుగా మళ్లించడంతో పెద్దగా సమస్య రాలేదు. మొత్తం మీద రాకదలలిరా సభ విజయవంతమైంది.

వైసీపీ నాయకులే కౌరవులు..



జగన్ సభలో కౌరవులు, పాండవులుగా మాట్లాడారు. వాస్తవానికి జగన్ గ్రహించాల్సి ఒకటుంది. పాండవులనే వారు టీడీపీ జనసేన కూటమే.కౌరవులు వైసీపీ నాయకులు. జగన్‌కి రామ్‌గోపాల్ వర్మ నిర్మించిన వ్యూహం సినిమా గురించి తెలుసు.. కానీ పద్మవ్యూహం గురించి తెలుసుకోవాలి.మడుగులో దాగున్న దుర్యోధనుడు జగన్.వైసీపీ అనేది ఇంపోర్ట్ ఎక్స్‌పోర్టు కంపెనీగా తయారైంది. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులను దోచేశారు.అన్ని వ్యవస్థలను సర్వనాశం చేశారు. ఇసుకమాఫియా,మట్టి మాఫియా ఇలా అన్ని వ్యవస్థల్లోను డబ్బులు నొల్లుకున్నారు.ఈ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు దాపురించాయి. టీడీపీ జనసేన కూటమి విజయబావుటా ఎగుర వేయడం ఖాయం.

- కందుల దుర్గేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు

దళిత ద్రోహి జగన్...



నాలుగేళ్ల తొమ్మిది నెలల జగన్ పాలనలో ఈ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలను అణచి వేసి జగన్ దళితద్రోహిగా మారాడు. ఇటీవల భీమిలిలో జరిగిన సభలో క్రాస్‌ముద్రణపోలిన ర్యాంపు వేసి బూట్లు, చెప్పులు ధరించిన కాళ్ళతో ఆ క్రాస్‌పై నడుస్తూ క్రైస్తవ్యాన్ని అపహాస్యం చేశాడు. భారత రాజ్యాంగానికి ఈ రాష్ట్రంలో తూట్లు పొడిచాడు. ఎస్సీ, ఎస్టీ మైనారిటీలను దగా చేశాడు. మాస్క్ అడిగిన డా. సుధాకర్ మొదలు డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు మారణకాండను సృష్టించాడు.దళితజాతి ఆత్మగౌరవం నిలబడాలంటే టీడీపీ జనసేన అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి.

- కేఎస్ జవహర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

జగన్‌ను ఇంటికి సాగనంపాలి



టీడీపీ హయాంలో 6,200 ఇళ్ళు కడితే వాటికి రంగులు మార్చాడే తప్ప వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా తూట్లు పొడిచాడు. జల జీవన్ మిషన్ రద్దు చేశాడు.రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేశాడు. బలహీన వర్గాలకు దగా చేశాడు. అవినీతి అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉన్న జగన్‌ను ఇంటికి సాగనంపాలి.

- గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్యే



జై బాబు : టీడీపీ జెండాతో మహిళ నినాదం



వెల్‌కమ్ సార్ : వేదికపై చంద్రబాబుకు నమస్కరిస్తున్న నాయకులు



వచ్చేశాం : సభకు తరలివచ్చిన కొవ్వూరు టీడీపీ, జనసేన నాయకులు



మేం సైతం : నిడదవోలు నుంచి వెళుతున్న నాయకులు



బాబును కలుద్దామని : సభ వద్ద ముప్పాళ్ల ఇతర న్యాయవాదులు



మీ కోసమే వచ్చాం : సభకు తరలివచ్చిన మహిళలు





బాబుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పత్తిపాటి, దుర్గేష్



నీవే మా రాజు : బాబుకు కిరీటం



మొక్కను ఇస్తున్న హరీష్, ఆదిరెడ్డి వాసు



బాబుతో జ్యోతుల నెహ్రూ



బాబుకు వరి కంకులు, నాగలి ఇస్తున్న చంటి



పుష్పగుచ్ఛమిస్తున్న బత్తుల



నులి పురుగుల నివారణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

కుష్ఠువ్యాధిగ్రస్తులపై వివక్ష వద్దు : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 29 : కుష్ఠువ్యాధి బాధితుల విషయంలో వివక్ష వద్దు అని, క్షయరహిత జిల్లాగా తూర్పుగోదావరిని తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. కలెక్టరేట్‌లో స్పర్శ అవగాహన పక్షోత్సవాల వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు.గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నుంచి ఫిబ్రవరి 13 వరకూ క్షయ వ్యాధి నిర్మూలన స్పర్శ అవగాహన పక్షోత్సవాలపై ప్రచారం నిర్వహించాలన్నారు. జేసీ తేజ్‌భరత్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎన్.వసుంధర,అధికారులు పాల్గొన్నారు.

9న నులిపురుగుల నివారణ కార్యక్రమం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 29 : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగుల నివారణ ఎంతో అవసరం అని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఫిబ్రవరి 9, 16 తేదీల్లో నిర్వహించే నులి పురుగుల నివారణ (డీ వార్మింగ్ డే)కార్యక్రమంపై వైద్యాధికారులు, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. నులిపురుగుల నివారణకు ప్రజలు, పాఠశాల విద్యార్థులు సహకరించాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు అవగాహన కల్పించాలన్నారు. వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పులి భయం..భయం

ఇంకనూ అంతుచిక్కని జాడ 7

ఆటోను ఢీకొన్న లారీ

ముగ్గురికి తీవ్ర గాయాలు 8



స్పందన దరఖాస్తులు పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

ఎస్పీ స్పందనకు 20 అర్జీలు

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సమస్యలు సత్వరం పరిష్కరిస్తామని అడిషనల్ ఎస్పీలు రాజశేఖర్‌రాజు, వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా పోలీసుల కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పోలీసులు, ఇతరులు తరలివచ్చారు.ప్రజల నుంచి 20 అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి చట్ట ప్రకారం త్వరితగతిన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

వచ్చే నెల 4వరకూ కులగణన : జేసీ

రాజమహేంద్రవరం, జనవరి29(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని కులగణన నూరుశాతం నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జేసీ తేజ్ భరత్ ఆదేశించారు. ఈ నెల 19వ తేదీ నుంచి కులగణన ప్రారంభించారు. 28వ తేదీలోగా పూర్తి చేయా లని ఆదేశించారు.కులగణన బాధ్యతను సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అంద జేశారు. అయితే అనుకున్న లక్ష్యం పూర్తికాలేదు. ఈ మేరకు కులగణన సర్వే వచ్చేనెల 4వ తేదీ వరకూ పొడిగించినట్టు జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తెలి పారు. ఇప్పటి వరకూ జిల్లాలో 88.17శాతం పూర్తి చేశామ న్నారు. కులగణన పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. ఎక్కడైనా తేడాలుంటే చర్యలు తప్పవని అన్నారు. కులగణనకు ప్రజలు సహకరించాలన్నారు.

కలెక్టర్ స్పందనకు 186 అర్జీలు : మాధవీలత

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా స్థాయి స్పందనకు 186 అర్జీలు వచ్చాయని, వాటి పరిష్కారానికి నిర్దీత కాలంలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత తెలిపారు. అర్జీలు ఆన్‌లైన్‌లో 164, ఆఫ్‌లైన్‌లో 22 వచ్చాయన్నారు.వాటిలో రెవిన్యూకు 71, పంచాయతీరాజ్ 33, పోలీస్ 15, విద్యుత్ 12 ఉన్నట్టు తెలిపారు. కోలమూరు గ్రామానికి చెందిన 9 స్వయం సహాయక సంఘ సభ్యులకు అర్హత ఉన్నా కాతేరు బ్యాంక్ ఆఫ్ బరోడా రుణాలు ఇవ్వడంలేదని ఫిర్యాదు చేశారు. నిడదవోలు మండలంలోని కలవచర్లకు చెందిన ఎలక నిర్మల ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేశారు. గోపాలపురం మండలం బుచ్చయ్యపాలెం గ్రామస్థులు డ్రైనేజీ సమస్యపై ఫిర్యాదు చేశారు.వీటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కొవ్వూరు మండలం ఆరికరేవులకు చెందిన కెఎస్ఎస్‌వీవీ సత్యనారాయణ తనకు 64శాతం వైకల్యం ఉందని, దివ్యాంగుల పెన్షన్ వర్తింప చేయాలని వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి సత్వర పరిష్కారంచూపాలని అధికారులకు సూచించారు.

విజిలెన్స్ ఎస్పీగా సుబ్బారెడ్డి

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా(విజిలెన్స్ ఎస్పీ) 2015 బ్యాచ్ ఐపీఎస్ అధికారి కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా మంగళగిరిలోని ఆరో బెటాలియన్ ఏపీఎస్పీ కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుబ్బారెడ్డిని రాజమహేంద్రవరం విజిలెన్స్ ఎస్పీగా బదిలీ చేసింది. సుమారు మూడేళ్లగా ఈ పోస్టు ఇన్‌చార్జిలతో నడుస్తోంది. ఏలూరు ఎస్పీ కరణం కుమార్. తర్వాత విశాఖ ఎస్పీ సురేశ్‌బాబు ఇప్పటి వరకూ ఇన్‌చార్జిగా ఉన్నారు. హోంమంత్రి సొంత జిల్లాలో విజిలెన్స్‌కి ఐపీఎస్ అధికారి పూర్తి స్థాయి విధుల్లో ఎన్నికలు సమీపిస్తుండగా నియమితులు కావడం గమనార్హం.

కత్తితో పొడిచిన భార్య.. భర్త మృతి

రాజమహేంద్రవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గొడవలు భర్త మృతికి దారితీశాయి. రాజమహేంద్రవరం రామదాసుపేటలో నివాసం ఉంటున్న జి.సత్తిబాబు, జ్యోతికి ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి పిల్లలు లేరు.ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి సత్తిబాబు తాగొచ్చి భార్యతో గొడవపడ్డాడు.ఈ క్రమంలో సత్తిబాబును జ్యోతి కూరగాయలు కోసుకొనే కత్తితో పొడిచింది. తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే అతడిని ఆమె, స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



సంఘీభావం తెలియజేస్తున్న కొవ్వూరు టీడీపీ నాయకులు



దేవరపల్లి నుంచి సభకు వెళ్తున్న టీడీపీ నాయకులు



దేవరపల్లి డైమండ్ జంక్షన్‌లో టీడీపీ సభకు వెళ్తున్న జనం, వాహనాలు



తాళ్లపూడి నుంచి బైక్‌లపై ర్యాలీగా వెళ్తున్న యువగళం టీం



చాగల్లు నుంచి సభకు వెళ్తున్న టీడీపీ నాయకులు



సభా ప్రాంగణంలో టీడీపీ జెండాలతో మహిళలు



సభా వేదికపై ప్రసంగిస్తున్న చంద్రబాబు



బైకులు, ఆటోలు, కార్లు, బస్సుల్లో రా..కదలి రా సభకు వస్తున్న టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు

జన చంద్రం

- కాతేరులో టీడీపీ రా.. కదలి రా బహిరంగ సభ
- తరలిన తెలుగుదేశం, జనసేన పార్టీల కార్యకర్తలు
- బైక్‌లు ఆటోలు, కార్లు, బస్సుల్లో ర్యాలీగా వెళ్లిన శ్రేణులు

కొవ్వూరు, జనవరి 29: రాష్ట్రంలో దుర్మార్గపు సైకోపాలనను తరిమి కొట్టడానికి టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన రా కదలిరా కార్యక్రమానికి కొవ్వూరు నుంచి వేలాదిగా తెలుగుదేశం, జనసేన పార్టీల కార్యకర్తలు తరలివెళ్లారు. సోమవారం కొవ్వూరు గామన్‌బ్రిడ్జి అండర్ పాస్ వద్ద కొవ్వూరు ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, నాయకులు మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనివాస్, నామాన పరమేష్ తదితరులు వెళ్లారు.

నిడదవోలు: నిడదవోలు గణేష్‌చౌక్ సెంటరు నుంచి సుమారు 20 వేల మంది తెలుగుదేశం, జనసేన పార్టీలు కార్యకర్తలు రా కదలిరా సభకు భారీగా వెళ్ళారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జనసేన నాయకుడు బోగవల్లి ప్రసాద్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సంక్షేమం, అభివృద్ధి అమలు చేయగలిగేది టీడీపీ-జనసేన ప్రభుత్వమని అన్నారు.

దేవరపల్లి: మండల కేంద్రమైన దేవరపల్లిలో డైమండ్ జంక్షన్ నుంచి గోపాలపురం నియోజకవర్గ స్థాయి టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బైక్‌లు ఆటోలు, కార్లు, బస్సుల్లో కాతేరు తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు, పరిశీలకుడు ఐతాబత్తుల ఆనందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు మాట్లాడుతూ రాక్షస పాలనతో చరమగీతం పాడి టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడానికి టీడీపీ, జనసేన శ్రేణులు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ దేవరపల్లి, గోపాలపురం మండలాల అధ్యక్షులు ఆండ్రూ అనీల్, అధ్యక్షు రొంగల సత్యనారాయణ, టీడీపీ, జనసేన నాయకులు గన్నమని హరికృష్ణ, ముళ్ళపూడి దొరాజీ, యాగంటి వెంకటేశ్వరరావు, బ్రహ్మారాజు, పెనుమత్స సుబ్బరాజు, ఉప్పులూరి రాంబాబు, కాట్నం గణేష్, ప్రదీప్ తదితర నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట నుంచి టీడీపీ యువగళం టీం భారీ బైక్ ర్యాలీగా రాజమహేంద్రవరం వెళ్లారు. కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, తొండెపు భరత్, దత్తుడు, వల్లిపల్లి సతీష్, తిగిరిపల్లి కనకరత్నం, శేషు, మణికంఠ తదితరులున్నారు. అలాగే టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. వీరిలో కొఠారు వెంకట్రావు, మైనం గంగరాజు, గోలి మణికంఠ, పేరూరి తాతారావు, కడలి కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

పెరవలి: మండలంలోని కానూరు, నడిపల్లి, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, అజ్జరం, కొత్తపల్లి, కాపవరం, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్లవేమవరం, మల్లేశ్వరం తదితర గ్రామాల నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు, అభిమానులు బైక్‌లు, ఆటోలు, కార్లలో ర్యాలీగా రాజమహేంద్రవరం వెళ్లారు. వీరిలో టీడీపీ మండలాధ్యక్షుడు అతికాల రామకృష్ణమ్మ, భూపతిరాజు రవివర్మ, బొడ్డు రామాంజనేయులు, సలాది కృష్ణమూర్తి తదితరులున్నారు.

చాగల్లు: మండల కేంద్రమైన చాగల్లు నుంచి బయలు దేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తల ర్యాలీని ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు జెండా ఊపి ప్రారంభించారు. తాళ్ళూరి హరిశ్చంద్రప్రసాద్, బొల్లిన శివనాగేంద్ర, తాళ్లూరి శ్రీనివాసరావు, దొంగ రామకృష్ణ, అల్తాఫ్ అహ్మద్ తదితరుల వెళ్లగా నెలటూరు, ఊనగట్ల, చిక్కాల, కలవలపల్లి గ్రామాలతోపాటు చంద్రవరం నుంచి మద్దిపాటి వీరరాఘవులు, దారవరం నుంచి బొడ్డు రాజు, మల్లవరం నుంచి కోడూరి కాశి విశ్వనాథం ఆధ్వర్యంలోను టీడీపీ నాయకులు కాతేరు వెళ్లారు.

టీడీపీ, జనసేన కూటమి విజయం ఖాయం

రా.. కదలిరా.. సభలో పార్టీల నేతలు

రాజమహేంద్రవరంసిటీ/రూరల్/కడియం: జనవరి 29: కాతేరులో జరిగిన రా.. కదలిరా.. బహిరంగ సభలో టీడీపీ, జనసేన ముఖ్య నేతలు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిల అధ్యక్షతన సభ ప్రారంభమైంది. చంద్రబాబునాయుడు రాకకు ముందే ముఖ్య నాయకులు కొందరు సభలో మాట్లాడారు. గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం ముందు-తరువాత ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారిందని, అభివృద్ధి పథంలో ఉన్న ఆంధ్రరాష్ట్రంలో 42 ఏళ్ల తరువాత రాక్షస పాలన జగన్ రూపంలో వచ్చిందన్నారు. దీన్ని అంతమొందించేందుకు రా.. కదలిరాకు చంద్రబాబు పిలుపునిచ్చారని తెలిపారు. మోసపూరిత హామీలతో జగన్ మహిళల నెత్తిన చెయ్యి పెట్టారని, మద్యపాన నిషేధం అంటూ మహిళల తాళిబొట్లు తెంపేశాడన్నారు. ఇటువంటి తరుణంలో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టీడీపీ, జనసేనలు కలిశాయని స్పష్టంచేశారు.

● గోపాలపురం జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడుతూ అన్యాయంగా చంద్రబాబును 52 రోజులు జైలులో పెట్టి ఆధారాలు లేని కేసులో కక్షసాధింపులకు పాల్పడిన జగన్ ఆనాడే తన రాజకీయ పతనానికి నాంది పలికాడన్నారు. చంద్రబాబును పరామర్శించిన పవన్‌కల్యాణ్ ఆరోజు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఇరుపార్టీలు జగన్ పాలనపై పోరాడుతున్నాయన్నారు. నాలుగేళ్ల తొమ్మిది నెలల కాలంలో జగన్ రూ.9 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజల నెత్తిన భారాన్ని మోపాడని ధ్వజమెత్తారు.



కారులో సభా ప్రాంగణానికి వెళ్తున్న మద్దిపాటి వెంకట్రాజు



మద్దిపాటి చిత్రంతో ఉన్న టీషర్ట్‌ల్లో టీడీపీ కార్యకర్తలు



చంద్రబాబుకు శాలువా కప్పుతున్న సుబ్బరాయచౌదరి



పొలం గట్టు మీదుగా రా.. కదలి రా సభకు వెళ్తున్న ప్రజానీకం



కాతేరు టీడీపీ సభకు వచ్చిన వారి వాహనాలు





కాతేరులో జరిగిన రా..కదలి రా సభకు హాజరైన అశేష జనవాహిని



సభకు వస్తున్న జనసేన పార్టీ శ్రేణులు

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి

కొవ్వూరు ఎంవీఐ స్వర్ణ శ్రీనివాస్‌నాయక్

కొవ్వూరు, జనవరి 29: రహదారి భద్రతా నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎంవీఐ బి.స్వర్ణ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా కొవ్వూరు అభ్యాస పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో అయన మాట్లాడారు. సెల్‌ఫోను మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతిఒక్కరూ హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. విద్యార్థి దశ నుంచి రోడ్ సైన్స్, రహదారి నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ఎండీ జమీర్, పాఠశాల ప్రిన్సిపాల్ పి.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలి

హోం మంత్రికి ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్ల వినతి



హోం మంత్రి వనితకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

గోపాలపురం, జనవరి 29: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఎన్‌వీ మహేష్ ఆధ్వర్యంలో హోం మంత్రి తానేటి వనితకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ26 వేలు చెల్లించాలని, పనిదినాల లక్ష్యాన్ని రద్దు చేయాలని, జూనియర్, సీనియర్ మేట్, ఫీల్డ్‌అసిస్టెంట్ అనే భేదం లేకుండా అందర్నీ ఫీల్డ్‌అసిస్టెంట్‌లుగా గురించాలని, 16 ఏళ్ల సీనియార్టీని గుర్తించి శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలన్నారు. సీనియార్టి, విద్యార్హతను బట్టి ప్రమోషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నిడదవోలు, జనవరి 29: నిడదవోలులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవిక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. అధ్యక్షుడిగా బచ్చు లక్ష్మణరావు (నాని), కార్యదర్శిగా ఉప్పల సతీష్, కోశాధికారిగా కేదారిశెట్టి సత్యనారాయణ, పలువురు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యకమంలో పలువురు వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

కొవ్వూరు, జనవరి 29: కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీపడదగిన సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్ బ్యాంకు బకాయి, మనోవర్తి, గృహహింస, వాహన ప్రమాద కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చునన్నారు. అలాగే ప్రీ లిటికేషన్, టెలిఫోన్ బకాయి కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు. లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.

'స్పందన'కు 6 ఫిర్యాదులు



ఫిర్యాదును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ

కొవ్వూరు, జనవరి 29: స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. సోమవారం కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజనల్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆరుగురు నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు పంపించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' విజేతలకు బహుమతుల ప్రదానం

కొవ్వూరు, జనవరి 29: గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. సోమవారం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల విజేతలకు మెమోంటోలు, ధ్రువపత్రాలు, అందజేశారు. నగదు బహుమతులను క్రీడాకారుల ఖాతాలకు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో కోడూరి శివరామకృష్ణ, కంటమణి రమేష్‌బాబు, రుత్తల భాస్కరరావు, అక్షయపాత్ర రవీంద్ర, బత్తి నాగరాజు, మద్దిపట్ల సాయిగీత, బండి పట్టాభిరామారావు, కమిషనర్ బి.శ్రీకాంత్, ఎంపీడీవో కె.సుశీల పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

పెరవలి, జనవరి 29: మండలంలోని అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కించారు. 32 రోజులకు రూ.2,58,350 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.రాధాకృష్ణ తెలిపారు.

నిడదవోలు ఎంపీడీవోగా శ్రీలలిత



సామర్లకోట, జనవరి 29: కాకినాడ జిల్లా సామర్లకోట ఎంపీడీవోగా పనిచేస్తున్న డి.శ్రీలలిత తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు ఎంపీడీవోగా బదిలీ చేస్తూ జడ్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా సామర్లకోట ఎంపీడీవోగా చోడవరం నుంచి శ్యామ్ సుందర్ రానున్నట్టు సమాచారం.

జనసేన, టీడీపీ ప్రచార డప్పు ఆవిష్కరణ



జనసేన, టీడీపీ ప్రచార డప్పును ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

కొవ్వూరు, జనవరి 29: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు టీడీపీ అధినేత చంద్రబాబును సోమవారం రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో జరిగిన రా కదలిరా కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన, టీడీపీ ప్రచార డప్పును చంద్రబాబుతో వేదికపై ఆవిష్కరించారు. డబ్బును వాయించి కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. రామారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. రామారావు వెంట జనసైనికులు, వీర మహిళలు ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం

గోపాలపురం, జనవరి 29: విశ్రాంత ఉద్యోగుల మండల స్థాయి సమావేశాన్ని సత్యసాయి మందిరంలో సోమవారం నిర్వహించారు. ఎం.సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు పలు తీర్మానాలు చేశారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు 1వ తేదీన పింఛన్ చెల్లించాలని, పెండింగ్ డీఏలను ఇవ్వాలని, ఈహెచ్‌ఎస్‌ను విస్తృత పరచాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

ముగ్గురికి తీవ్ర గాయాలు
ఆసుపత్రికి తరలింపు

కొవ్వూరు, జనవరి 29: లారీ ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎం.సునోద్ తెలిపారు. కొవ్వూరు మండలం చిడిపి గ్రామానికి చెందిన పెదవేగి వెంకటేష్, తండ్రి నాగభూషణం సోమవారం ఆటోలో కొవ్వూరు నుంచి చిడిపి బయలుదేరారు. ఆరికిరేవుల పాశాలమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్, నాగభూషణం, ఆటో డ్రైవర్ శ్రీనులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

దొంగతనం కేసులో వ్యక్తికి రిమాండ్

ఉండ్రాజవరం, జనవరి 29: దొంగతనం కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ వి.అప్పలరాజు సోమవారం తెలిపారు. మండలంలోని పాలంగిలో గత ఏడాది జూలై 20న మాగాపు చినబాబు ఇంట్లో లేని సమయంలో తాళం పగలగొట్టి ఈతకోట రాజ్‌కుమార్ బంగారు వస్తువులు దొంగిలించుకుపోయాడు. అప్పట్లో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా వ్యక్తిని పట్టుకొని అతని బంగారం రికవరీ చేసి కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆరడుగుల గోధుమ తాచు హతం



నల్లజర్ల, జనవరి 29: మండలంలోని చీపురుగూడెంలో ఆరడుగుల పొడవున్న గోధుమ తాచుపాము గ్రామస్థుల చేతిలో హతమైంది. గ్రామానికి చెందిన రైతు చెల్లు శివబాబు తమ వ్యవసాయ క్షేత్రంలో సోమవారం పశువులను మేపుతుండగా తాచుపాము ఎదురుపడి బుసలు కొట్టడంతో భయంతో కేకలు వేయడంతో చుట్టు ఉన్న రైతులు వచ్చి పామును కర్రలతో కొట్టి హతమార్చారు.

వైసీపీ పాలనపై ప్రజాభిప్రాయాలు...

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/అర్బన్, జనవరి 29: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలో జరిగిన రా.. కదలి రా.. సభకు ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి అశేష జనవాహిని తరలివచ్చింది. ఈ సందర్భంగా వైసీపీ పాలనపై, టీడీపీ అధికారంలోకి రావలసిన అవశ్యకతపై పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

రైతు పరిస్థితి బాగోలేదు : నల్లూరి సూర్యారావు, నల్లజర్ల

ఈ ప్రభుత్వం వచ్చాక రైతు పరిస్థితి బాగోలేదు. డ్రిప్‌కి సబ్సిడీ, సున్నా వడ్డీలు లేవు. మోటార్లకు మీటర్లు పెడుతున్నారు. భూసర్వే ఉన్న తగాదాలను పరిష్కరించకపోగా.. మాలో మేం కొట్టుకు చచ్చేట్లు ఉంది. సర్వే రాళ్లను ఇష్టానుసారం మార్చేస్తున్నారు. మళ్లీ టీడీపీ రావాలి. మా పరిస్థితి బాగుపడాలి.

మళ్లీ వస్తే.. రాష్ట్రం తాకట్టే : కె.సత్యనారాయణ, ప్రకాశరావుపాలెం

జగన్ వచ్చాక పోలవరం కాలువను నాశనం చేశాడు. అమరావతిని ఏం చేశాడో అందరం చూశాం. అప్పులు తెచ్చి పంచిపెడుతున్నాడు. చేను బాకీ తీర్చకపోతే అప్పు ఇచ్చినోడు ఏం చేస్తాడు. మళ్లీ వైసీపీ వస్తే అదే జరుగుతుంది. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టేస్తాడు. జిరాక్సు దస్తావేజులు మనకి ఇచ్చి.. ఒరిజినల్‌ని బ్యాంకుల్లో పెట్టి అప్పులు తెచ్చేస్తాడు. తెలుగుదేశం అధికారంలోకి రాకపోతే ఈ రాష్ట్రంలో బతకలేం.

ఓటు చంద్రన్నకే : మందపాటి వరలక్ష్మి, గౌరీపట్నం

నా ఓటు చంద్రన్నకే వేస్తాను. జగన్ ప్రభుత్వం పేదోళ్లకు చేసిందేమీ లేదు. కూలి పనికీ కష్టంగా ఉంది. నిజం చెప్పినా ఇబ్బంది పెడుతున్నారు. ఇన్నేళ్ల నుంచి ఎప్పుడూ ఇంత కష్టం పడలేదు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురు చూస్తున్నాం. మళ్లీ టీడీపీ వస్తే మాలాంటి చిన్నోళ్ల బతుకులు బాగుపడతాయి.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	గుంటూరుకారం
వై.స్క్రీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్